సెప్టెంబర్ 2017

దసరా శుభాకాంక్షలతో

కొత్తపల్లి

తెలుగు పిల్లల ఈ మాసపత్రిక వెల రూ.25/-





సంపుటి: 3 సంచిక: 5 పుటలు: 68 విడి ప్రతి వెల: 25 సెప్టెంబర్ 2017

Editor: Narayana Sarma

Owned, Printed and Published by:
Kottapalli Prachuranalu,
1-127/A, Near MRO Office,
Chennekothapalli,
Ananthapuramu District
Andhra Pradesh-515101
Website: http://kottapalli.in
Email: team@kottapalli.in
Phone: 7702877670

Printed at:
Mudrica Offset Printers,
Sanyasi Raju street,
Gandhi Nagar,
Vijayawada,
Andhra Pradesh
Phone: 08662579129

RNI Registration No: APTEL/2014/62705
Postal Registration No: HDP/008/2015-17

స్ఫూర్తి : యు. సుబ్బరాజు

సంపాదకులు: జి.వి. నారాయణ శర్మ

ప్రచురణ:

కొత్తపల్లి ప్రచురణలు, చెన్నేకొత్తపల్లి

యాజమాన్యం:

సత్య - ఫౌండేషన్ ఫర్ ఎ హెల్దీ సొసైటీ, చెన్నూరు.

చిత్రాలు:

అడవి రాముడు : 9491870753

వీరాంజనేయులు : 7799260684

ఫైనార్ట్స్ చదువుతున్న ఇతర మిత్రులు కూడా.

వెబ్సైటు నిర్వహణ:

ఆనంద్, లక్ష్మి

వాణిజ్యం, మార్కెటింగు:

బి. అశోక్: 9963571510



విషయ సూచిక



ముఖ చిత్రం: మూడు రంగుల జెండా!

చిత్రకారుడు: సి. రాము

93



హర్తుర్యాతి న గోచరం, కిమపిశంపుష్ణాతి యత్సర్వదా-
పృర్థిభ్య: ప్రతిపాద్యమానమనిశం ప్రాప్నోతి వృద్ధిం పరామ్,
కల్పాంతేష్వపి న ప్రయాతి నిధనం, విద్యాఖ్యమంతర్ధనం
యేషాం తాన్ప్రతిమానముజ్ఝత నృపా: కస్తై: సహ స్పర్ధతే

సంస్కృత మూలం
(భర్తృహరి)

తెలుగు అనుసరణ
(ఏనుగు లక్ష్మణ కవి)

హర్తకుగాదు గోచరమహర్నిశమున్ సుఖపుష్టి జేయు, స
త్కీర్తి ఘటించు, విద్యయను దివ్యధనంబఖిలార్థికోటికిన్
బూర్తిగనిచ్చినన్ బెరుగు; పోదు యుగాంతపు వేళనైన, భూ
భర్తలు తద్ధనాధికుల పట్టున గర్వము మానుటొప్పగున్

భావం: విద్య అనేది దొంగలకు కనబడదు. ఎల్లవేళలా సుఖాన్ని వృద్ధి చేస్తుంది. కీర్తినిస్తుంది. విద్య అనే దివ్యధనం ఎంతమందికి ఇచ్చినా పెరుగుతుంది తప్ప, తరిగదు. ఈ యుగం అంతం కావచ్చేమోగానీ, విద్యకు మటుకు అంతం ఉండదు. రాజులు, చక్రవర్తులు కూడా విద్యాధనం కలిగి ఉన్న పండితులముందు తలవంచవలసిందే.

మరో స్వాతంత్ర్యం

"వరుణ్! వరుణ్! ఏం చేస్తున్నావురా, నువ్వు? ఎక్కడున్నావ్?" విసుక్కుంటూ వాడిని వెతికింది అమ్మ.

పడక గదిలో బెడ్ మీద పడుకొని, సెల్ఫోనులో ఏదో గీకుతున్న వరుణ్ ఆమె రాకని కూడా గమనించలేదు.



"నిన్నే! ఏం చేస్తున్నావు? టైమెంతైందో చూసావా? ఇంకో ఇరవై నిముషాల్లో స్కూల్ బస్ వచ్చేస్తుంది. నువ్వు ఇంకా ముఖం కూడా కడుక్కోలేదు!"

"ఫేస్ బుక్ అప్డేట్ చేస్తున్నాను మమ్మీ! అయినా స్కూల్ బస్ మిస్సయితే మాత్రం ఏముంది? డాడీ కారులో తీసుకెళ్లి దింపుతాడు. మా క్లాస్మేట్ విమల్ గాడిని వాళ్ల డాడీ రోజు దింపట్లేదా?" అన్నాడు వరుణ్, లేచి చెడ్డీ దులుపుకుంటూ.

వాడు బాత్రూంలోకి దూరే సరికి సుజాత టిఫెన్ రెడీ చేసేసి, ప్లేటులో కూడా పెట్టేసింది. వాడు కాళ్ళు ఊపుకుంటూ వచ్చి టేబుల్ ముందు కూచొని, ఒక చేత్తో సెల్ఫోను గీకుతూ, మరో చేత్తో టిఫెన్ చెయ్యటం మొదలెట్టాడు.

సుజాత నెయ్యి వేస్తుంటే 'ఛ!' అని అరిచాడు అకస్మాత్తుగా.

"ఏమైంది?!" అంది సుజాత భయపడుతూ.

"యీా నెట్ కనెక్షన్ ఏందే?! దీని మార్పించు ఫస్టు! యీా బియస్సెన్నెల్ ఇంతేనే, కేబుల్ కనెక్షన్ అయితే దీనికి టెన్ టైమ్స్ స్పీడుంటుంది!" అన్నాడు వాడు, టెలిఫోనుకేసి కోపంగా చూస్తూ.

"అవును వాడి డబ్బులు కూడా ఎక్కువే మరి!" అంది సుజాత వెటకారంగా.

"జస్ట్ డబలే మమ్మీ! బియస్సెన్నెల్ వాడికి ఊరికే ఐదొందలు కడతావు; వాడికైతే థౌంజండ్ రుపీస్ కట్టాలి. కానీ టెన్ టైమ్స్ స్పీడు ఉంటుందని చెబుతున్నాను కదా, ఇంకేమి?" అన్నాడు అనునయంగా.

బాత్రూంలో వేసి ఉన్న గీజరునూ, బెడ్రూంలో ఇంకా తిరుగుతున్న ఫ్యానునూ ఆపి వస్తూ సుజాత మళ్ళీ పురాణం విప్పింది- "నీకు ఎన్ని సార్లు చెప్పినా అర్థం కావట్లేదు. నీ పని అయిపోగానే గీజర్ ఆపాలి. రూం లోంచి బయటికి వచ్చే ముందే ఫ్యాన్ ఆపాలి".

"కూల్, మమ్మీ! ఛిల్లవ్వు నువ్వు కొంచెం! ఈ మధ్య వచ్చే ఫ్యాన్‌లు తెలుసా, ఎంత తిరిగితే అంతనే కరెంట్ తీసుకుంటాయి. ఇదివరకు లాగా కాదు- ఫస్ట్ నెంబర్లో పెట్టినా హై స్పీడంత కరెంట్ కాల్చువివి! టెక్నాలజీ, మమ్మీ! మనం ఆపకపోయినా ఏమీ పర్లేదు! ఏమంత ఖర్చుకాదు. జస్ట్ ఒక ఫిఫ్టీ రుపీస్ ఎక్కువ అవుతుందేమో, అంతే!" ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతాన్ని వివరించినట్లు వివరించాడు వరుణ్.

"అందుకే, ఇదివరకు వంద రూపాయలు వచ్చే కరెంటు బిల్లు ఇప్పుడు ఆరొందలు వస్తోంది. నువ్వు తొందరగా తినేసి గేటుదగ్గరికి పో ముందు!" వాడి చేతుల్లోకి పుస్తకాల సంచిని కూరి, బలవంతంగా బయటికి నెట్టింది సుజాత.



వాడు బడినుండి తిరిగొచ్చే సరికి కరెంటు లేదు.

"ఏంటి మమ్మీ, ఎప్పుడు పోయింది కరెంట్?" అడిగాడు.

"మధ్యాహ్నం అనగా పోయింది. ఎక్కడైనా రిపేరు చేస్తూండచ్చు" అన్నది సుజాత నిర్లిప్తంగా.

"అందుకే ఫ్రిజ్‌లో పెట్టిన చాక్లెట్లన్నీ మెత్తమెత్తగా ఐపోయాయి. రోహిణి అత్త ఎంత ఇష్టంగా పంపించిందో కద, వాటిని? అవన్నీ వేస్టే ఇంక!" అన్నాడు వాడు.

"వేస్టెందుకైతాయి? కరెంటువచ్చాక మళ్ళీ గట్టిగా ఔతాయిగా?!" అంది సుజాత ఆత్మరక్షణ మోడ్ లోకి వెళ్ళి.

"నీకు తెలీదు మమ్మీ, చాక్లెట్ కరిగి, మళ్లీ గట్టి పడితే దాని టేస్టు మారిపోతుంది. మంచిగా ఉండదు" చెప్పాడు వాడు. "అందుకనే ఇప్పుడు అందరూ ఇన్వర్టర్ మీద నడిచే ఫ్రిజ్జులను కొనుక్కుంటున్నారు" అన్నాడు.

వాడికి కాంప్లాన్ కలిపిన పాలు ఇచ్చింది సుజాత. తాగుతూనే పోయి టివి ఆన్ చేయ బోయాడు వాడు. కరెంటు లేదని ఆలస్యంగా గుర్తిస్తూ- "ఇన్వర్టర్ తెమ్మందామా, డాడీని?!" అన్నాడు. "జస్ట్ ఓ ట్వంటీ థౌజండ్ ఐతే చాలు మమ్మీ, ఇంక కరెంట్ సమస్యే ఉండదు" చెప్పాడు.

"అయినా అది లేకపోతే ఏం నష్టం వొచ్చింది, మన పని మనం చేసుకోవచ్చు!" అంది సుజాత.

"అదే కదా, సమస్య?! ఐపియల్ వచేస్తుంది మమ్మీ! ఇంక నెల రోజుల వరకూ ప్రాబ్లమే!" అన్యాయం అయిపోయినట్లు ముగించాడు వాడు.

"ఇంతకీ మీ పరీక్షలు ఎప్పుడురా? మీ క్లాసు ఫస్టు మార్కులు ఎన్నొస్తాయి; నీకు ఎన్ని మార్కులు వస్తాయి?" ధైర్యంగా అడిగేసింది సుజాత.

"పో మమ్మీ! ఎప్పుడూ 'మార్కులు-మార్కులు' అంటావు. వాటిదేముంది? వస్తే వస్తాయి;

లేకపోతే లేదు! అవన్నీ పట్టించుకుంటే ఇంక ఐనట్లే!"

"టీవీ, ఫ్రిజ్, సెల్ఫోన్, ఏసీ, లాప్టాపు, కెమెరా, కరెంటు, ఫేస్బుక్కు- ఇవి ఉంటే చాలు కదా; చదువులు ఏంచేసుకునేకి?!" అంది సుజాత, చికాకుగా లేచి ఇంట్లోకి పోతూ.

మనందరం ఇప్పుడు కరెంటుకు బానిసలం. రకరకాల గాడ్జెట్లకు బానిసలం. అవి లేకపోతే బ్రతుకు దుర్భరం అనిపించే స్థితి. ఈ బానిసత్వంలోంచి విముక్తిని కూడా మనమే, ఎవరికి వాళ్లం సాధించుకోవాల్సి ఉంది. సహజవనరులకోసం మనం నివసించే ఈ భూమిని పీడించకుండా ఉండాలంటే, ముందుగా మనకు మనం తెచ్చుకోవలసిన 'మరో స్వాతంత్ర్యం' ఇది! ఏమంటారు?!

బానిసత్వంలోంచి బయట పడేందుకు ప్రయత్నిస్తున్న మీ అందరికీ శుభాభినందనలతో,

కొత్తపల్లి బృందం

స్వాగతం!

కొత్తపల్లిలో పిల్లల రచనలకు ప్రాధాన్యత ఉంటుంది. ఈ పుస్తకంలో దాదాపు సగం కథలు పిల్లలు రాసినవి; మిగిలినవి పిల్లలకోసం పెద్దలు రాసినవి. బొమ్మలు వేసిన వాళ్ళు మటుకు యువకులు.

పిల్లలను కలవటం, వాళ్లతో తెలుగులో కథలు రాయించటం, బొమ్మలు వేయించటం, వాళ్ళు పంపిన కథల్ని, బొమ్మల్ని సరిదిద్ది మిగతా పిల్లలందరికీ నచ్చేట్లు పుస్తకాలుగా తయారు చేయటం, దానికోసం ఓపెన్ సోర్సు ఉపకరణాలను వాడటం, కథల్ని అందరూ ఉచితంగా చదువుకునేట్లు ఇంటర్నెట్లో పెట్టటంతోపాటు, కొన్ని ప్రతులు అచ్చు వేయటం మాకు ఇష్టం. అందరి మేలూ కోరి చేసే ఈ పనిలో మీరూ పాలుపంచుకోండి. పిల్లల కథల ప్రపంచానికి స్వాగతం !



బిట్టు - కవిత్వం

బిట్టు కథ – 1

మీకు ఏమనిపిస్తున్నది ? బిట్టు కవిత్వంలో మునిగిపోతే, మరి చదువులు ఎలాగ ?

రచన : శ్రీమతి అనురాధ నాదెళ్ళ.

బిట్టు వాళ్లు ఢిల్లీలో ఉంటారు. వాడికి తొమ్మిదేళ్ళు. వాళ్ళ అమ్మ సునంద ఒక ఐటీ కంపెనీలో పని చేస్తుంది; నాన్న శివ బ్యాంకులో.

బిట్టు మరీ పసివాడుగా ఉన్నప్పుడంతా వాడి అమ్మమ్మ, నానమ్మ వంతులు వేసుకుని వచ్చి ఉండేవాళ్ళు. కాస్త ఊహ తెలిసాక వాణ్ణి 'క్రెష్' లో అలవాటు చేసేరు అమ్మానాన్నలు.

"తీరికలేని ఉద్యోగాలలో పడి, పిల్లవాణ్ని సరిగా పెంచుకోలేక పోతున్నామేమో" అని ఒక్కోసారి బాధ పడుతుంటారు వాళ్ళు.

అట్లాంటప్పుడే, సాధారణంగా తల్లులు ఉద్యోగం మానేసేది! కానీ అట్లా ఉద్యోగం మానేసి పిల్లవాణ్ణి చూసుకుందామని అనుకోలేదు సునంద. 'చదువుకున్న చదువుకు సార్థకత ఉండాలంటే తను ఉద్యోగం చేయాల్సిందే' అని ఆమె నమ్మేది. "ఆడవాళ్ళు ఆర్థికంగా స్వతంత్రంగా

ఉండాలి" అని ఆమె ఎప్పుడూ చెబుతుండేది.



బిట్టు ఐదో క్లాసుకొచ్చాడు. చుట్టూ ఉన్న ప్రపంచాన్ని చూడటమంటే వాడికి చాలా ఇష్టం. అందరు పిల్లల్లాగా వాడు నిద్ర లేచేందుకు మారాం చేసేవాడు కాదు;. అమ్మ లేపగానే ఛెంగున లేచేవాడు; నవ్వు ముఖంతో మంచం దిగేవాడు. చక్కగా బడికి రెడీ అయిపోయేవాడు. అందరితోటీ మాట్లాడాలనీ, అవసరమున్న వారికి సాయం చెయ్యాలనీ ఉత్సాహం వాడికి.

కానీ అమ్మ, నాన్న మటుకు వాడిని అతి జాగ్రత్తగా చూసుకునే వాళ్ళు. తమ కనుసన్నల్లోంచి వాడిని ఎటూ పోనిచ్చేవాళ్ళు కాదు.

ఆరోజు తను ఆఫీసు నుంచి వస్తూ వస్తూ, క్రెష్‌కి వెళ్ళి బిట్టూని ఇంటికి తీసుకొచ్చింది సునంద. వాడికి పాలు కలిపి ఇచ్చి, తను కాఫీ తాగుతూ, రాబోయే వేసవి శెలవుల గురించి ఆలోచించింది: 'ఇవాళ్ల శివ రాగానే బిట్టూ కోసం ఏదైనా మంచి ట్రిప్ ప్లాన్ చెయ్యాలి' అనుకున్నది.

బిట్టూ పాలు త్రాగేసి 'మామ్, జావేద్ అంకుల్ దగ్గరకి వెళ్తున్నా!' అని అరిచి, సమాధానం కోసం చూడకుండా పరుగెత్తాడు.

ప్రక్క ఇంట్లో ఉంటారు జావేద్‌గారు. ఆయన రిటైర్డు టీచర్; కవి కూడా.

ఆయన కవిత్వాన్ని వినేందుకు, రకరకాల చర్చలు జరిపేందుకు రోజూ సాయంత్రం అవుతూనే ఎవరో ఒకరు వస్తూంటారు ఆయన దగ్గరికి. బడినుండి ఇంటికి వచ్చాక, ఒంటరిగా తనంతట తాను కొద్దిసేపు ఆడుకునే బిట్టూకి, జావేద్‌గారి ఇంట్లో జరిగే

హడావుడిని రోజూ బాల్కనీలోంచి గమనించటం ఇష్టమైంది.

వాళ్ల సంభాషణలేవీ వీడికి పూర్తిగా అర్థమయ్యేవి కావు; కానీ వాళ్ల కేరింతలు, వాహ్వాలు వినటం, వాళ్ళు బిగ్గరగా నవ్వినప్పుడు తనూ నవ్వటం వీడికీ అలవాటైంది. అట్లా అని వీడు వాళ్లతో ఏమీ మాట్లాడేవాడు కాదు.



ఒకరోజు జావేద్ ఒంటరిగా ఏదో రాసుకుంటూ ఉన్నారు. బిట్టూ ఆయనకేసే చూస్తూ కూర్చున్నాడు. కొద్ది సేపటికి బిట్టూని చూసి, దగ్గరకి పిలిచారు జావేద్‌గారు. 'తనేదైనా తప్పు చేసేడేమో' అని కొంచెం భయపడ్డాడు బిట్టూ:

అమ్మ చెబుతుంటుంది, "అలా ఇతరుల ఇళ్లల్లోకి చూడకూడదు, వేరే వాళ్ల ప్రైవసీకి భంగం కల్గించకూడదు" అని.

"అయినా 'ప్రైవసీ' అంటే ఏమిటి?" అని అడిగాడు అర్థం కాక.

"ప్రైవసీ అంటే..., ఊఁ... ప్రైవసీ అంటే 'నువ్వు ఒక్కడివే ఉండాలని, ఎవరూ నిన్ను పట్టించుకోకుండా ఉండాలనీ' అనుకోవటం. ఒక్కోసారి అలా అన్పిస్తుంది కదా, ఉదాహరణకి- నువ్వు మామిడిపండు తింటున్నావనుకో, ఎలా తింటావు? చెయ్యి, నోరు అంతా పూసుకుని ఇష్టంగా తింటూంటావు కదా. అలాంటప్పుడు ఎవరైనా నీకేసే తేరిపార చూస్తుంటే నీకు ఇబ్బందిగా ఉండదూ? అలాగే మన పనులు మనం చేసుకునేప్పుడు ఎవరైనా అదేపనిగా గమనిస్తూ ఉంటే మనకి ఇబ్బందిగా ఉంటుంది కదా, అదన్న మాట!" చెప్పింది అమ్మ.

అది జ్ఞాపకం వచ్చింది బిట్టూకి. అందుకని జావేద్ పిలిచినప్పుడు కాస్త సంకోచంగానే

వాళ్ల ఇంటికి వెళ్లి, ఆయన మాట్లాడకముందే 'సారీ అంకుల్' అనేసాడు. "వాళ్లింట్లో జరుగుతున్న చర్చలు, మాటలు తను రోజూ వింటూ, చూస్తూ ఉంటాడు కదా, జావేద్ అంకుల్ ప్రైవసీకి తను ఇబ్బంది కలిగిస్తున్నాడు. అందుకే పిలిచి ఉంటారు" అనుకున్నాడు వాడు.

ఆయన నవ్వి,' ఏమైంది, సారీ ఎందుకు చెబుతున్నావ్?' అని అడిగారు.

అమ్మ చెప్పిన 'ప్రైవసీ' విషయం చెప్పాడు బిట్టూ. ఆయన గట్టిగా నవ్వేసి, 'నిజమే. అమ్మ చెప్పిన మాట గుర్తుంచుకోదగ్గదే. కానీ రోజూ నిన్ను గమనిస్తున్నాను- నువ్వు మా ఇంటికేసి చూస్తుంటావు; నా స్నేహితులు, నేను మాట్లాడుకుంటూంటే శ్రద్ధగా వింటుంటావు. కానీ నీకు ఏం అర్థమవుతోందో నాకు తెలీదు కదా, అది కనుక్కుందామని పిలిచాను..' అన్నారు, బిట్టును తన ప్రక్కనే ఉన్న కుర్చీలో కూర్చోబెట్టుకుని.

'అంకుల్, మీరు కవిత్వం రాస్తారట కదా, కవిత్వం అంటే ఏమిటి?' ఎప్పటినుండో అడగాలనుకుంటున్నది అడిగేసాడు బిట్టు.



జావేద్ అంకుల్ మళ్ళీ ఒకసారి నవ్వేసి.

'కవిత్వం అంటే.. చెబుతాను- నీ ఇంగ్లీషు వాచకంలోనూ, హిందీ వాచకంలోనూ పద్యాల లాంటివి-అంటే పాఠాలగా చదివేవి కాకుండా, పాడుకునేలాంటివి- ఏమైనా ఉన్నాయా?' అని అడిగారు.

'ఉన్నాయంకుల్. అవంటే నాకు చాలా ఇష్టం. పాఠాలకంటే బాగుంటాయవి. వాటినే నేను పాటలుగా పాడుతుంటాను' ఉత్సాహంగా చెప్పాడు బిట్టూ.

జావేద్ అంకుల్ కళ్లు మెరిశాయి. 'ఏదీ, ఒక

కవిత పాడు!' అన్నారు.బిట్టూకి అకస్మాత్తుగా తనకు ఎవరో కిరీటం పెట్టి సింహాసనం మీద కూర్చోబెట్టినట్టు అనిపించింది. బాగా గుర్తున్న ఒక పద్యాన్ని చక్కగా ఒక పాటలాగా పాడాడు. పాట పూర్తవుతూనే జావేద్ లేచి బిట్టూని కౌగిలించుకున్నారు. 'కవితని ఇట్లా- ఇంత చక్కగా పాడటం ఎవరు నేర్పారు బిట్టూ, నీకు?' అంటూ.

'నేనే పాడుకుంటాను. టీచర్ రెసిటేషన్‌కి ఇచ్చిన పద్యాల్ని ఇట్లా పాటలాగా పాడుకుంటూ నేర్చుకుంటాను. నాకు అలా బావుంటుంది. మా టీచర్ కూడా నా చేత పాడిస్తారు అప్పుడప్పుడు.'



జావేద్ లేచి వెళ్లి అలమరలో ఉన్న ఒక బిస్కెట్ ప్యాకెట్ తెచ్చి వాడి చేతిలో పెడుతూ 'బిట్టూ, నీ చుట్టూ ఉన్న ప్రపంచంలో నీకు కనిపించే వాటిని గురించి, వినిపించే వాటిని గురించి నువ్వు మనసులో ఏమని ఆలోచిస్తూ ఉంటావో, దాన్నంతా నీ భాషలో నువ్వు అందంగా వ్రాయటమే కవిత్వం అంటే. అర్థం అయిందా? కొందరికి అట్లా వ్రాయటం ఇష్టంగా ఉంటుంది.

రోజూ నువ్వు నా దగ్గరకొచ్చి క్రొత్త క్రొత్త పాటలు పాడుతూ ఉండాలి- సరేనా? మరి మీ అమ్మ నీకోసం ఎదురుచూస్తుంటుంది, వెళ్లు' అంటూ గుమ్మం వరకూ వచ్చి సాగనంపారు. అలా మొదలైన స్నేహం వాళ్ళిద్దరి మధ్య రోజు రోజుకూ పెరుగుతూ వస్తోంది.

రోజూ ఒక అరగంట పాటు బిట్టూ హోం వర్క్ చేసుకుంటాడు. 'అది అయిపోయాక వాడికి వేరే కాలక్షేపం ఏం కల్పించాలి?' అని సునంద తెగ కష్టపడేది. ఇప్పుడు ఆమెకు ఆ బెంగ తీరిపోయింది.

ఒక రోజు రోజూ కంటే ఉత్సాహంగా జావేద్

అంకుల్ దగ్గరకి పరుగు పెట్టాడు బిట్టు- 'అంకుల్, ఈ రోజు మీకు ఒక క్రొత్త విషయం చూపిస్తాను' అంటూ తన నోటు పుస్తకంలో రాసిన కవితను ఒకదాన్ని చూపించాడు ఆయనకి.



అది చదివిన జావేద్ ఆశ్చర్యంతో చాలాసేపు అలా కూర్చుండిపోయారు- "ఇంత పసివాడు ఇలాటి సంఘటన గురించి అర్థం చేసుకోవటమే కష్టం! అలాటిది, ఆ సంఘటన మీద ఒక పద్యం అల్లుకొచ్చాడు! ప్రతిభకి వయసుతో పని లేదు, నిజంగానే!" అనుకున్నారు ఆయన.

అంతకు ముందు రోజున ఢిల్లీలో ఇండియా గేట్ దగ్గర ఉన్న ఓ పూల దుకాణం ముందు ఒక బాంబు ప్రేలింది.

ప్రేలుడులో దుకాణదారుతో పాటు అతని భార్య, ఇద్దరు పిల్లలు చనిపోయారు. దాన్ని గురించి ఆరోజు న్యూస్ పేపర్లలో చాలా వివరాలు వచ్చాయి. చనిపోయిన ఆ పిల్లలిద్దరూ కూడా అంతవరకూ తాము పోటీలు పడి కట్టిన పూల దండల మధ్యే మిగిలిపోయారు. ఈ సంఘటన బిట్టూని కదిలించి ఉండాలి- వాడు ఈ కవితని అల్లాడు:

'తెల్లవారితే జెండా పండుగ!
రాత్రి నిద్రని ఆవులింతలో దాచాను!
పూలహారాల్ని అల్లుతూనే ఉన్నాను!
ఎదురుగా ఇండియా గేట్!
చలిని ఓడించేందుకు మేజోళ్లు కొనిస్తానంది అమ్మ!
అల్లికలో చెల్లిని ఓడిస్తానని పందెం కట్టాను!
నా ఒడిలో, నా ప్రక్కన, నా చుట్టూ పూల దండలే దండలు!

ఎర్రెర్రని, తెల్లతెల్లని పూల దండలు!

అన్ని పూల దండల మధ్య నేను!'

'నిద్రని ఆవులింతలో దాచటం ఏమిటి? ఇదెవరు చెప్పారు?' అడిగారు జావేద్.

'శెలవురోజున అమ్మతో పాటు రాత్రిపూట ఆలస్యంగా కూర్చుని టి.వి. చూస్తాను కదా, అప్పుడు అమ్మ అలాగే అంటుంది అంకుల్!' అసలు విషయం చెప్పాడు బిట్టూ.



ఎంత అమ్మ చెప్పినదైనా, ఆ భావనని అంత శ్రద్ధగా తీసుకొచ్చి తన కవితలో పొదిగిన తీరు జావేద్‌కి చాలా నచ్చింది. 'అద్భుతం బిట్టూ! నువ్వు పెద్ద కవివి అవుతావు!' అంటూ దీవించారు.

బిట్టూ ఆనందానికి అంతులేదు. ఆరోజు రాత్రి పడుకుంటే నిద్ర పట్టలేదు వాడికి. ఏవేవో కలలు: తను ఒక పెద్ద సింహాసనం మీద ఠీవిగా, రాజులాగా కూర్చుని ఉన్నాడు. సినిమాల్లో చూసినట్టు పెద్ద సభ. తన చుట్టూ మంత్రులు కూర్చొని ఉన్నారు. తర్వాత వాళ్ళు ఒక్కొక్కళ్ళూ లేచి, తనని పొగుడుతూ, పూలమాలలు వేసి సత్కరిస్తున్నారు!

"బిట్టూ! తెల్లవారిపోయింది. లే! చాలా ఆలస్యమైంది ఇవాళ్ల" నిద్రలేపింది అమ్మ. ఎన్నడూ లేనిది, ఈ రోజున చాలా బద్ధకంగా లేచాడు బిట్టూ. సునంద ఆశ్చర్యపోయింది.

'ఏమైంది బిట్టూ, అలా వున్నావేం?' అంటూ ఒళ్లు వెచ్చ చేసిందేమో చూసి, 'హమ్మయ్య, జ్వరమేమీ లేదులే!' అన్నది.

'తన కవిత గురించి అమ్మకి, నాన్నకి చెప్పాలా, వద్దా?' అని ఆలోచిస్తూ, ప్రత్యేకంగా ఏమీ చెప్పకనే స్కూలుకు వెళ్ళిపోయాడు బిట్టూ.

ఆ రోజున బిట్టూ హోంవర్కు పుస్తకం చూసిన లెక్కల టీచర్ మిస్ మార్గరెట్‌కి అందులో హోంవర్కు బదులు ఏదో కవిత్వం లాటి పదార్థం కనిపించి తిక్కరేగింది: “హోంవర్కు, ఎందుకు చెయ్యాలి?!" అని ఒక ఐదు నిముషాల పాటు ఉద్వేగంగా చెప్పేసి, బిట్టూని క్లాసు బయట నుంచోబెట్టింది ఆవిడ!



బిట్టూకి అర్థం కాలేదు. 'ఇలా ఎలా అయింది? తను హోమ్ వర్క్ చెయ్యలేదా? చేసాననుకున్నాడే?! మరి తను రాసిన కవిత్వం ఈ నోట్సులోకి ఎలా వచ్చింది?!’

సాయంత్రం ఇంటికొచ్చేప్పుడు లెక్కల టీచర్ ఒక 'నోట్' రాసి ఇచ్చింది. రేపు అమ్మని కానీ, నాన్నని కానీ తీసుకు రావాలి. లేకపోతే ప్రిన్సిపల్ సార్‌కి ఫిర్యాదు చేస్తారు.

ఎప్పుడూ "బిట్టూ గుడ్ బాయ్" అని చెబుతుంటారు అందరూ. కానీ ఈ రోజు క్లాసు బయట నుంచో పెట్టటమే కాక, ఇంటికి కూడా ఉత్తరం పంపారు! ఇంకా అమ్మని కూడా స్కూలుకి తీసుకు రమ్మన్నారు, అల్లరి పిల్లలకు చెప్పినట్లు!

ఆరోజు సాయంత్రం బిట్టూని పిల్చుకొచ్చేందుకు క్రష్‌కు వెళ్ళిన సునందకు 'బిట్టూ ఇంటికి వెళ్ళిపోయాడు' అని చెప్పారు వాళ్ళు. చూడగా ఇంటి బయట, మెట్ల మీద దిగులుగా కూర్చుని ఉన్నాడు బిట్టూ.

‘ఏరా, ప్రొద్దున్న కూడా కాస్త తేడాగా ఉన్నావ్. జ్వరం వచ్చిందేమిటి?’ అన్నది సునంద, ఇల్లు తాళం తీస్తూ. ‘అదీ కాక నేను లేకుండా నిన్ను ఒక్కడినే ఇంటికి పంపదుగా, రేణు ఆంటీ? మరి ఎలా వచ్చావ్?’

'జాగ్రత్తగా వెళ్లిపోతా ఆంటీ!' అని చెప్పి వచ్చాను. అయినా ఇవాళ్ల ఎందుకనో పిల్లలందరూ త్వరగా వెళ్లిపోయారు; ఆంటీ ఏమో ఎవరినో చూసేందుకు ఆసుపత్రికి వెళ్ళాలని అనుకుంటోంది- అందుకే వచ్చేసాను' చెప్పాడు బిట్టూ. 'తన కొడుకు అట్లా ఎదుటివాళ్లని అర్థం చేసుకుంటాడు' అని సునందకి మరీ ముద్దు.



హోమ్‌వర్క్ అయ్యాక, కథల పుస్తకం ఒకటి తీసుకుని చదువుకుంటూ కూర్చున్న కొడుకుని చూస్తూ 'ఇవాళ్ల మీ కవి గారింటికి వెళ్లవా ఏమి?' అంటూ వేళాకోళం చేసింది సునంద.

'రేపు స్కూలుకి రమ్మని అమ్మకు ఎలా చెప్పాలి?' అని ఆలోచిస్తూ కథల పుస్తకం తిరగేస్తున్న బిట్టు, అమ్మ ప్రశ్నకి గంభీరంగా 'వెళ్లను' అనేశాడు. వ్యవహారం ఏదో కొంచెం తేడాగా ఉందని గ్రహించిన సునంద "శివని రానీ, ఇద్దరం కలిసి బుజ్జగిస్తే అప్పుడు చెబుతాడు విషయం ఏమిటో" అనుకొని, అప్పటికి ఊరుకున్నది.

శివ వచ్చాడు. భోజనాల దగ్గర ఇద్దరూ కలిసి కొడుకుని మరీమరీ అడిగారు- 'ఏమీ లేదమ్మా, నిద్రవస్తోంది. ఈరోజు త్వరగా పడుకుంటా!' అని భోజనం అవుతూనే పక్క ఎక్కేసాడు బిట్టు.

హోమ్ వర్క్ పూర్తి చేసాక రోజూ తన డైరీలో అమ్మ చేత సంతకం చేయించుకునేవాడు వాడు. ఇవాళ్ల మటుకు డైరీ అలాగే పుస్తకాల బల్ల మీద ఉండిపోయింది. తను నిద్రపోబోతూ ఒకసారి వాడి గదిలోకి తొంగి చూసింది సునంద. బిట్టు మంచి నిద్రలో ఉన్నట్టున్నాడు. వాడి పుస్తకాలు ఎక్కడివక్కడే ఉన్నై. వాటిని సరిగా సర్దేందుకని బల్ల దగ్గరకొచ్చిన సునందకు

తను డైరీలో సంతకం చెయ్యలేదని గుర్తొచ్చింది. డైరీ తెరిచి చూసి, ఉలిక్కిపడ్డది: డైరీలో తనకి ఒక నోట్ ఉంది. 'రేపు స్కూలుకొచ్చి లెక్కల టీచర్ని కలుసుకోవాలి' అని!



"ఎందుకు?" అని ఆశ్చర్యపోయిన సునంద వాడి పుస్తకాల సంచీని మొత్తాన్నీ ముందుగదిలోకి తీసుకెళ్ళింది. తను, శివ ఇద్దరూ బిట్టూ పుస్తకాల్ని తెరిచి చూసారు- చూస్తే ఏముంది, లెక్కల నోట్‌బుక్‌లో వాడు రాసిన కవిత కనిపించింది! "ఓహో! వీడు తెలుగు పాఠాన్ని తీసుకొచ్చి పొరబాటుగా లెక్కల పుస్తకంలో రాసినట్లున్నాడు" అనుకున్నారు వాళ్ళు!

కానీ మళ్ళీ చదివి, రఫ్ నోట్‌బుక్ తీస్తే అప్పుడు అర్థమైంది: వాడు అంతకు ముందు రోజు రాసిన కవిత రఫ్ కాపీ, ఆ తర్వాత దాని ఫెయిర్ కాపీ, అటుపైన జావేద్ అంకుల్ రాసిన 'కంగ్రాట్యులేషన్స్, మై డియర్ యంగ్ పోయెట్!' కనబడ్డాయి!

సునంద, శివ ఇద్దరూ తమ కళ్లను తాము నమ్మలేక పోయారు. ఇద్దరూ కాసేపు మాట్లాడుకోకుండా కూర్చుండిపోయారు. ఆపైన సునంద అంది, 'మా తాతగారు పెద్ద కవి- తెలుసా, ఆయన ఒక పద్యాల పుస్తకం కూడా అచ్చు వేయించుకున్నారు. జీన్స్ ఎక్కడికి పోతాయి!' అని, గర్వంగా.

'హలో!- నేను కాలేజీలో ఉండగా మా కల్చరల్ యూనిట్‌కి, కాలేజీ మ్యాగజైనుకి సెక్రటరీని- తెలుసుగా, బోలెడు కవితలు రాసాను! నా జీన్స్ వాడిలో పుష్కలంగా ఉన్నాయి. అది తెలుసుకో!' అంటూ మొదలెట్టాడు శివ.

కాస్సేపు అట్లా మురిసిపోతూ వాదించుకున్నాక, "అందుకేననమాట, మన కవిగారు అంత చిన్నబోయి ఉన్నారు ఇవాళ్ల" అన్నది సునంద. "రేపు మనం వెళ్ళి ఆ బడి వాళ్లకు ఏవో కథలు చెప్పాలన్నమాట!"

"ఏమీ లేదు- 'మా వాడిని గొప్ప కవి చేద్దామనుకుంటున్నాం; వాడిని మీరు ఊరికే ఏమీ అనకండి' అని చెబుదాం. దానిదేముంది?!" నిశ్చయంగా అన్నాడు శివ.

"అంతే మరి! కాబోయే కవుల్ని ఆపే హక్కు వాళ్లకెవరిచ్చారు? అయినా వాడి కవిత చూసావుగా, ఎంత బాగుందో?!" అన్నది సునంద, మురిసిపోతూ.

"అవునవును- ఎవరి జీన్స్.." మొదలెట్టాడు శివ.


ఆ రాత్రి కూడా బిట్టుకి కలత నిద్రే అయింది... తనేమో కవితలు రాసేస్తున్నాడు. లెక్కల హోమ్ వర్క్ అస్సలు చెయ్యట్లేదు. చూసి చూసి, టీచర్ ఒక్కసారిగా గట్టిగా అరిచేసింది! ఆపైన స్కేలుతో ఒక దెబ్బ వేసింది. 'నా లెక్కల పుస్తకంలో కవితలు రాస్తావా?' అంటూ మరో దెబ్బ వెయ్యబోతుంటే బిట్టుకి మెలకువ వచ్చేసింది!

తనకు చెరో ప్రక్కనా కూర్చొని చిన్నగా నవ్వుతున్నారు అమ్మా, నాన్నా. "కవితలు రాసుకునేందుకు నాకు వేరే నోట్సు కావాలి!" అన్నాడు బిట్టూ, క్లుప్తంగా.

"ఓం, తప్పకుండా! నువ్వు రాసిన కవిత బలే బాగుంది. నిజంగానే నువ్వు గొప్ప కవివౌతావు!" మురిపెంగా నవ్వారు సునంద, శివ వాడి తల నిమురుతూ. బిట్టూ సంతోషంగా నవ్వి, వెంటనే మళ్ళీ నిద్రపోయాడు.

నాన్న: ఏరా లెక్కల్లో వందకు పైనే మార్కులు వచ్చాయన్నావు? మరి రెండు మార్కులు వచ్చాయేంట్రా?

చింటూ: అవును నాన్నా! ఆ రెండు ఎక్కడ వేశారో చూడు. వందకి పైనే కదా!



ఎవరు గొప్ప?

కొత్త బేతాళం

ఆధారం: అజయ్, రిషివ్యాలీ స్కూల్

బొమ్మలు: సుస్మిత్, 9 వతరగతి, రాధ స్కూల్ ఆఫ్ లర్నింగ్

తను ఎన్ని సార్లు విడిపించుకున్నా వెనుతిరగకుండా, మళ్ళీ ఇంకోసారి తనని పట్టుకునేందుకు వస్తున్న విక్రంని చూసి బేతాళం "ఇదిగో ఇన్స్పెక్టర్ బాబూ! ఆ సిద్ధప్ప నిజంగానే నీకు ఏదో మందు పెట్టినట్టున్నాడు. లేకపోతే ఎందుకు, ఇట్లా వదలకుండా నా వెంట పడతావు? నేను మొదటినుండీ చెబుతూనే ఉన్నాను కద, 'వాడు సరైనవాడు కాదు' అని?! అయినా నువ్వు నన్ను వాడికి పట్టించుదామని చూస్తున్నావంటే, నీ మంచితనంలోనో, లేక నీ తెలివిలోనేనో- ఏదో సమస్య ఉండి ఉండాలి. తప్పు ఎక్కడున్నదో కనుక్కునేందుకు గాను నీకో చిట్టి కథ

చెబుతాను విను. ఈ కథని రిషివ్యాలీ స్కూల్‌లో చదివే అజయ్ చెప్పాడు నాకు, చాలా కాలం క్రితం" అంటూ ఇట్లా చెప్పసాగింది:

అనగా అనగా ఒక ఊళ్ళో ఐదుగురు మాంత్రికులు ఉండేవాళ్ళు. ఒక రోజున ఆ ఐదుగురు మాంత్రికులూ వేరే ఊరికి బయలు దేరారు. అట్లా పోతూ ఉంటే, వేగంగా పారే నది ఒకటి అడ్డు వచ్చింది వాళ్ళకు.



నదికి వరద వచ్చి ఉన్నది. ఎటు చూసినా అలవికానన్ని నీళ్ళు! దాటేదెలాగ? .

వాళ్ళలో ఒకడు అన్నాడు: "చూడండి, మనందరం మామూలు మనుషులం కాదు. టక్కుటమార విద్యలు నేర్చిన మహా మాంత్రికులం. కనుక మనందరం ఇప్పుడొక పోటీ పెట్టుకుందాం. ఎవరైతే మంచిగా, తెలివితో ఈ నదిని దాటి అవతలి ఒడ్డుకు చేరుకుంటారో, మనందరిలోకీ వాళ్ళే గొప్ప మాంత్రికులు!" అని.


అందరూ సరేనన్నారు.

మొదట ఒకడు నదిని మొత్తాన్నీ ఒక సీసాలో బంధించేసాడు. ఇసకలో నడుచుకుంటూ అవతలి ఒడ్డుకు చేరుకున్నాడు. ఆ తర్వాత సీసా మూత తీసి, నదిని వదిలేశాడు.

రెండవ వాడు నవ్వాడు. తన చెప్పుల్ని తీసి ముందు పెట్టుకున్నాడు. ఏవేవో మంత్రాలు చదివాడు. తర్వాత ఆ చెప్పులు వేసుకొని, నీళ్ళమీదనుండి మామూలుగా నడుచు-కుంటూ పోయాడు!

మూడవవాడు తన తుండుగుడ్డనొకదాన్ని తీసి ముందు పెట్టుకున్నాడు. ఏవో మంత్రాలు చదివాక, దాన్ని నడుముకు

కట్టుకున్నాడు. ఆ వెంటనే గాలిలోకి లేచి, అలవోకగా నదిని దాటేసాడు!



నాలుగో వాడు ఊపిరిని బాగా పీల్చి నది మీదికి ఊదాడు. నది అంతా గింగిరాలు తిరిగి, మొత్తంగా ఆవిరైపోయింది! ఒకసారి వాడు దాటాక, ఆవిరైన నీళ్లన్నీ తిరిగివచ్చి నదిలో పడ్డాయి.

ఐదో వాడు మంత్రాలు చదివేటప్పటికి నదికి అవతల అడవిలో ఉన్న చెట్లు ఒక వంద, అక్కడికి వచ్చి చేరుకున్నాయి. ఆ చెట్లతో వంతెన కట్టి, కులాసాగా నడచుకొంటూ నదిని దాటాడు అతను!

బేతాళం ఇంతవరకూ చెప్పి, "ఇప్పుడు చెప్పు విక్రం, వీళ్ళలో ఏవరుగొప్ప? ఎందుకు?" అని అడిగింది.


విక్రం కొంచెం ఆలోచించి, "బాగున్నది బేతాళం. వీళ్లు ఐదుగురూ మంత్రగాళ్ళే. సాధారణ మానవులకు అతీతమైన శక్తులు వీళ్ళకు ఉన్నై. వీళ్ళు నదిని సీసాలో బంధించగలరు; నీళ్ళమీద నడవగలరు; గాలిలో ఎగరగలరు; నదిని మొత్తంగా ఆవిరి చేయగలరు! ఐతే ఈ నాలుగు శక్తులూ కేవలం ఆయా మంత్రగాళ్ళకు మాత్రమే ఉపయోగపడతాయి తప్ప, ఇతరులెవ్వరికీ వాటి ఫలాలను ఆస్వాదించే అవకాశం లేదు. ఐతే ఐదోవాడు ఉపయోగించిన వంతెన శక్తి వీటికి భిన్నమైనది. వంద చెట్లను పోగొడితే పోగొట్టింది గాని, తర్వాత పది కాలాలపాటు జనాలు ఉపయోగించుకునేందుకు తగిన వంతెననైతే ఇచ్చింది అది! అందుకని, సందేహంలేదు- వీళ్ళలో ఐదోవాడే గొప్పవాడు!" అన్నాడు.

విక్రం మౌనం భంగం అవ్వటంతోటే బేతాళం అతని చేతుల్లోంచి తప్పించుకొని మళ్ళీ చెట్టెక్కి కూర్చున్నది!

ఆకలి ఎంత?

సేకరణ : 3 వ తరగతి A గ్రూపు పిల్లలు, రాధ స్కూల్ ఆఫ్ లెర్నింగ్ , అనంతపురం.

బొమ్మలు: సి.ఎస్.సుహ అంజూ, 8 వ తరగతి, రాధ స్కూల్ ఆఫ్ లెర్నింగ్



అనగనగా అడవిలో ఒక సింహం ఉండేది. ఒకసారి అది వేటకు పోయింది. కొంచెం కష్టపడగానే దానికి ఓ కుందేలు దొరికింది. కుందేలు ధైర్యంగా "నేను చాలా చిన్న దాన్ని, సింహరాజా! నీ ఆకలికి నేను ఏం సరిపోతాను చెప్పు? నన్ను పట్టించుకోకు. వదిలేసి ముందుకు పోతే నీకు నాకంటే పెద్ద జంతువు అలవోకగా దొరకదా?" అన్నది.




"అవును కదా" అని సింహం కుందేలుని వదిలేసి ముందుకు నడిచింది. ప్రాణాలు దక్కిన కుందేలు "దేవుడా! కాపాడావు!" అనుకుంటూ చటుక్కున పరుగుపెట్టింది.

అంతలో సింహానికి ఒక జింక కనిపించింది. సింహాన్ని చూడగానే అది పరుగు లంకించుకున్నది. పరుగెత్తి, పరుగెత్తి అతి కష్టం మీద దాన్ని పట్టుకుంది సింహం.

వెంటనే జింక కూడా "నీ ఆకలికి నేను ఒక లెక్కా, పత్రమా సింహరాజా?! తమ పంటి కిందికి కూడా రానే?! నాతో ఆగిపోకుండా, సూటిగా ముందుకు పోతే, నీకు నాకంటే పెద్ద జంతువు దొరకదా?" అనేసింది.

"నిజమే" అనిపించిన సింహం జింకని ఏమీ చెయ్యకుండా వదిలేసింది.



ఈసారి దానికి దుప్పి ఒకటి కనిపించింది. సింహాన్ని చూడగానే దుప్పి పరుగు లంకించుకున్నది. దానికోసం అడవి అంతా తిరగాల్సి వచ్చింది సింహానికి. చివరికి ఎంతో కష్టపడి దాన్ని పట్టుకోగానే, అది "అయ్యో సింహరాజా! నా శరీరం నీ ఆకలిని ఎంత తీరుస్తుంది, చెప్పు?! ఇదంతా నీకు ఒక్క పూటకు మాత్రమే కద, నన్ను వదిలి ముందుకు పోతే నీకు ఇంకా పెద్ద జంతువు దొరుకుతుంది- తప్పకుండా!" అన్నది. "నిజమే కదా, ఇంత సన్న జంతువు నాకేం సరిపోతుంది?!" అనుకున్న సింహం, దుప్పిని వదిలి పెట్టి ఇంకా ముందుకు వెళ్ళింది.



ఈసారి దానికి ఒక పెద్ద దున్నపోతు కనిపించింది. సింహం ఒక్క దూకున దాన్ని పట్టుకోబోయింది గానీ, అది తప్పించుకొని అడ్డగోలుగా పరిగెత్తింది. సింహం దాని వెంట పడింది. అది ఇంకా ఇంకా వేగంగా పరుగెత్తింది. ఆ సరికి అలిసిపోయిన సింహమే కుప్పకూలింది. దాని ఒళ్ళు హూనం అయిపోయింది; గుండె పని చేయనన్నది!

ఇంక ఒక్క అడుగు కూడా వేయలేని స్థితిలో దానికి రెండే ప్రశ్నలు మిగిలాయి: "నా ఆకలి ఎంత? నా పరుగు ఎక్కడికి?

చిలుక, టమాటా, ఆపిల్ కథ


రచన: వెంకట దుర్గా భవాని, 5 వతరగతి, కంకణాలపల్లి

బొమ్మలు: సి.ఎస్.సుహ అంజూం, 8 వతరగతి, రాధ స్కూల్ ఆఫ్ లర్నింగ్



అనగనగా ఒక చిలుక ఉండేది. ఆ చిలుకకు ఒక ప్రాణ స్నేహితురాలు. అది ఒక టమాటా.

ఒకసారి వాళ్ళిద్దరూ గుడికి వెళ్తూ ఉన్నారు. వెళ్తూ ఉంటే, దారిలో వాళ్లకు ఒక మేక ఎదురైంది. ఆ మేక కాళ్ళు ముళ్ళ కంపల్లో ఇరుక్కుని ఉన్నాయి. అది తన కాళ్ళను బయటికి లాక్కునేందుకు ప్రయత్నించిన కొద్దీ ముళ్ళు ఇంకా గట్టిగా దిగుతున్నాయి; అది నొప్పి భరించలేక కళ్ళ నీళ్ళు కారుస్తున్నది.



దాన్ని చూసి చిలుకకు జాలి వేసింది. సహాయం చేయాలని అనుకుంది. కానీ ఎలాగ? టమాటాకేసి చూసింది. టమేటాకూడా సరేనన్నట్లు తల ఊపింది.

వెంటనే అవి రెండూ మేక దగ్గరకు వెళ్ళి, "నువ్వు కొంచెం ఆగు. ఓపిక పట్టు. మేం నీకు నేను సహాయం చేస్తాం!" అని కంపతో కుస్తీ పట్టటం మొదలెట్టాయి. అయినా ఏమాత్రం లాభం లేకపోయింది. ముళ్ళు అన్నీ

గీసుకుపోయి మేక కాలునుండి రక్తం కూడా కారసాగింది.



"అయ్యో! ఇప్పుడెలాగ?" అని అవి రెండూ ఆలోచనలో పడ్డాయి.

అంతలో అటుగా పోతున్న ఆపిల్ వచ్చింది అక్కడికి- "ఏం చేస్తున్నారు, సోదరులారా?!" అంటూ.

"పాపం, ఈ మేకను చూడు- దాని కాలు ముళ్ళలో ఇరుక్కుపోయింది. దానికి చాలా నొప్పి పుడుతున్నది. ఎలాగైనా దాన్ని ఈ ముళ్ళ బారినుండి తప్పించాలని ప్రయత్నిస్తున్నాం" అన్నాయి చిలుక, టమాటా.

ఆపిల్ మారు మాట్లాడకుండా పోయి రెండు కర్రలు తెచ్చింది. ఒక కర్రని మేక కాలు ముందువైపునుండి, మరో కట్టెను దాని కాలు వెనకవైపునుండి దూర్చింది ముళ్ళ కంపలోకి. "ఇదిగోండి- ఈ కర్రల్ని ఇద్దరూ వేరు వేరు వైపులకు లాగండి" అన్నది. దాంతో ముళ్ళ కంప రెండుగా చీలి, మేక దాని మధ్యలో నిలబడగల్గింది.

"ఆగండి- మీరిద్దరూ ఇట్లానే పట్టుకొని ఉండండి- నేను ఇంకో ఉపాయం చేస్తాను" అని ఆపిల్ దొర్లుకుంటా వెళ్ళి కుర్చీని పిల్చుకొచ్చింది. కుర్చీ చెక్కది కదా, దానికి ముల్లులంటే భయంలేదు. చిలుక, టమేటా లాగి పట్టుకున్న ముళ్ళ కంచెను అది కాస్తా పైకి నెట్టేసింది. అటుపైన మేకను తన మీద కూర్చోపెట్టుకొని యింటికి తీసుకువెళ్ళి కాలికి కట్టుకట్టింది. మేకకు బాగయ్యేంత వరకు టమోట, ఆపిల్ కూడా అక్కడే ఆగాయి.

ఆలోగా చిలుక,టమోటా చాలా పాటలు రాసాయి; కొన్ని కొన్ని పాటలు పాడాయి కూడా.

"ఒకటే ఒకటే ఒకటే
మనమంతా ఒకటే
మనందరికీ తల ఒక్కటే
తలక్రింద ఉండే ముఖం ఒక్కటే
ముఖంలో ఉండే ముక్కు ఒక్కటే
ముక్కు కింద ఉండే నోరు ఒక్కటే,
నోటిలోఉండే నాలుక ఒక్కటే
నాలుక పుట్టించే మాట ఒకటే!" అని.



మంచి రచయిత!

టీచర్: మీ అభిమాన రచయిత ఎవరు?

పిల్లలు: జార్జి వాషింగ్టన్ టీచర్.

టీచర్: అలాగా ..జార్జి వాషింగ్టన్ ఏ పుస్తకమూ రాయలేదే?

పిల్లలు: అందుకే ఆయనంటే చెప్పలేనంత ఇష్టం టీచర్..

సత్య హరిశ్చంద్ర!

రాము: నీ వయస్సెంత ?

సోము: పన్నెండు సంవత్సరాలు

రాము: క్రితం ఏడాది కూడా నువ్వు ఇలాగే చెప్పావే!

సోము : అయితే ఏంటట. నేను మాట మీద నిలబడే రకాన్ని.

అర్థ తెలివి!

భిక్షగాడు: గుడ్డి వాణ్ణి ఓ రుపాయి దానం చేయండమ్మా!

వ్యక్తి: నువ్వు గుడ్డివాడివేంటి? నీకు ఒక కన్ను బాగానే ఉందే ?

భిక్షగాడు: అయితే అర్థ రూపాయి దానం చేయండి.

వ్యక్తి: ఆ!!



లచ్చయ్య మంచితనం

రచన: శ్రీకాంత్, 9 వ తరగతి, తేజవిద్యలయం, కొమరబండ, కోదాడ, సూర్య పేట, తెలంగాణ.



లింగేశ్వరంలో ఉండే కోటేశ్వరావు గొప్ప ధనవంతుడు, పరమ పిసినారి. 'అతనికి ఉన్నంత డబ్బు పిచ్చి వేరే ఎవ్వరికీ ఉండదు' అని చెప్పుకునేవాళ్ళు.

ఎంగిలి చేత్తో విదిలిస్తే కాకులకు మెతుకులు దొరుకుతాయని, అతను అన్నం తినేప్పుడు ఎప్పుడూ చేతుల్ని తనకు దగ్గరగానే పెట్టుకునేవాడు.

కంచం అంచు వెంబడి మెతుకులు క్రింద

పడకుండా ఉండాలని, తను ఎప్పుడు అన్నం తిన్నా, కంచం మధ్యలోనే కలుపుకొని తినటం అలవరచుకున్నాడు.

ఇంటికి ఎవరైనా అతిథులు వస్తే వాళ్ళు అడగకుండానే గ్లాసులకు గ్లాసులు నీళ్ళు ఇచ్చి, వాళ్లను వీలైనంత త్వరగా తిప్పి పంపించేవాడు: "వామ్మో! అతను బిచ్చగాడి నుండే బిచ్చం ఎత్తుకుంటాడు" అని బంధువులు ఎవ్వరూ అతని ఇంటికి వచ్చేవాళ్ళు కాదు.



అదే ఊళ్ళో మంచి, మర్యాద, మానవత్వం కలిగిన పేద రైతు ఒకడు ఉండే వాడు. అతని పేరు లచ్చయ్య. ఉన్నంతలో తృప్తిగా జీవించేవాడు లచ్చయ్య. ఇంటికి వచ్చిన అతిథులకు దేన్నైనా ప్రేమానురాగాలతో పంచేవాడు. తను ఒక పూట అన్నం తినకపోయినా ఇతరులకు పెట్టేవాడు. "నాకు వేరే ఏమీ ఇవ్వకపోయినా పర్లేదు కానీ, ఇంటికి వచ్చిన వాళ్ళకి కడుపునిండా అన్నం పెట్టి, సంతోషంగా సాగనంపే శక్తిని మటుకు ఉండనివ్వు స్వామీ" అని రోజూ దేవుడిని ప్రార్థించేవాడు.

రాను రాను ఆ చుట్టు ప్రక్కల ప్రాంతాల వాళ్ళంతా లచ్చయ్య గురించి గొప్పగా చెప్పుకోవటం మొదలెట్టారు. దానితోబాటే కోటేశ్వరరావు పిసినారితనం కూడా ప్రచారమైంది. దాంతో కోటేశ్వరరావుకి లచ్చయ్య మీద కోపం పెరిగిపోయింది!

చివరికి అతనిక తట్టుకోలేక, దూరం నుండి పిలిపించిన రౌడీలను కొందరిని లచ్చయ్య ఇంట్లో దొంగతనానికి పంపించాడు.

ఆరోజు రాత్రి వాళ్ళు భోజనం కోసం వెతుక్కుంటుంటే ఎవరో చెప్పారు- "ఈ టైములో భోజనం ఎక్కడ దొరుకుతుంది?

ప్రక్కనే లచ్చయ్య ఇంటికి పోండి, కనీసం ఏ ఊరగాయో వేసి ఇంత అన్నం పెడతాడు" అని.

అట్లా ఆ దొంగలు లచ్చయ్య ఇంట్లోనే భోజనాలు చేసారు. మరి ఆ సమయంలో వాళ్ళు ఏమనుకున్నారో ఏమో: ఆ రోజు రాత్రి కోటేశ్వర రావు ఇంట్లోనే దోపిడీ జరిగింది! దొంగలు అతని దగ్గరున్న డబ్బునీ, నగల్నీ, విలువైన సామాన్లనీ మొత్తం దోచుకుపోయారు!

దు:ఖంలో ఉన్న కోటేశ్వరరావు కుటుంబానికి కూడా లచ్చయ్యే ఆసరాగా నిలిచాడు. వాళ్ళు తినేందుకు రోజూ భోజనం వండి పంపించాడు!

అంతలో వాళ్ళ పొరుగూరు లింగగిరిలో చెరువు కట్ట తెగింది- నీళ్ళన్నీ ఊళ్లోకి వచ్చాయి; పలు కుటుంబాలకు చెందిన ఇళ్ళు కూలిపోయాయి. లచ్చయ్య ముందుపడి, పునరావాసపు పనులు మొదలుపెట్టాడు. దానికోసం తనకున్న కొద్దిపాటి భూమినీ అమ్మేసేందుకు సిద్ధపడ్డాడతను! అయితే ఊళ్ళో వాళ్లంతా ముందుకొచ్చి, చందాలు వేసుకొని ఆ పనిని తమ వంతుగా నెరవేర్చారు.

అంతలోనే మరో అద్భుతం జరిగింది. లచ్చయ్య కృషిని మెచ్చుకుంటూ ఎవరో కోటీశ్వరుడు ముందుకొచ్చి, పెద్ద మొత్తం విరాళంగా ఇచ్చాడు. ఆ సంగతి చెప్పి, లచ్చయ్య ఊళ్ళోవాళ్ళిచ్చిన చందాల డబ్బును ఎవరిది వాళ్ళకు వాపసు చేసాడు!

దీన్నంతా దగ్గరనుండి గమనించిన కోటేశ్వరరావులో పరివర్తన కలిగింది- "ఇకమీద నేను లచ్చయ్యను వేరుగా చూడను- నా కుటుంబ సభ్యులలో ఒకడుగా ఆదరిస్తాను. అతను చేసే మంచిపనుల్లో నేను కూడా పాలు పంచుకుంటాను" అనుకున్నాడు.

అతనిలో మార్పును గమనించిన కుటుంబ సభ్యులూ, ఊళ్ళోవాళ్ళు కూడా చాలా సంతోషించారు.



చిలుక సాయం

బొమ్మలకథ

రచన :అభిరామ్, నాగతరుణ్, ఐదో తరగతి, వికాస విద్యావనం, పోరంకి, విజయవాడ.

బొమ్మలు :పి.బార్గవి, 9 వతరగతి, రాధ స్కూల్ ఆఫ్ లర్నింగ్, అనంతపురం.



చిలకలూరిపేటలో ఉండే చిన్నయ్య

పొట్టకూటికోసం చిలక జోస్యం చెప్పేవాడు. అతని దగ్గర మాట్లాడే రామచిలుక ఒకటి ఉండేది. ఆ రామచిలుకని చాలా ముద్దుగా పెంచుకునేవాడతను. దానికి రోజూ రకరకాల పళ్ళు తెచ్చి పెట్టేవాడు.

ఒకసారి ఒక రంగయ్య వచ్చి అతనితో జాతకం చెప్పించుకున్నాడు.

చిన్నయ్య తనదైన పద్ధతిలో జోస్యం చెబుతూ "ఇంకేముంది, నీకు కల్యాణయోగం దగ్గరపడింది. ఇంకో పదిహేను రోజుల్లో నీకు పెళ్ళి అవుతుంది" అనేసాడు.



తీరా పదిహేను రోజులు అయ్యాయి, కానీ పెళ్ళిమాత్రం అవ్వలేదు! ఆ సరికే విసిగి పోయిన రంగయ్య తన కోపాన్నంతా చిలక జోస్యుడి మీద చూపించాడు. అతను, అతని స్నేహితులు చిన్నయ్యను ఎగతాళి చేస్తూ, కొట్టటం మొదలుపెట్టారు.

వాళ్ల గందరగోళం నడుమ రామచిలుక తన పంజరం నుంచి బయటపడి, తన స్నేహితుల దగ్గరకు పోయింది. "వాళ్ళెవరో నా గురువును కొడుతున్నారు. వచ్చి సాయం చేయండి" అని బ్రతిమాలుకున్నది.

చిలకల గుంపు వచ్చి తన్నులు తింటున్న చిన్నయ్య ముందు వాలింది. రామ చిలుక వెళ్ళి గురువుకు అడ్డం పడుతూ "పాపం, ఈయన్ని ఏమీ అనకండి.

ఈయన వల్లే కదా, నాకు ఇంత ఆహారం దొరుకుతున్నది? దయచూడండి" అన్నది.

"అవునవును- అతను ఏదో పొట్టకూటికోసం తిప్పలు పడుతున్నాడు. ఊరికే కొట్టకండి" అని గుంపులో వాళ్ళొకరు అన్నారు.

దాంతో రంగయ్య, మిత్రులు అందరూ తలవంచుకొని ఎవరి దారిన వాళ్ళు పోయారు.

రంగయ్య చిలుక సహాయానికి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. ఆరోజునుండీ దాన్ని పంజరంలో పెట్టటం మానేసాడతను!



మూఢనమ్మకం

"చదువు నేర్చుకో-అదే నీకు దారి చూపుతుంది. విద్య నేర్చుకో-అది నీకు విధిని తెలుపుతుంది. వినయం నేర్చుకో-అది నీకు విజ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. గురువును మించిన దైవం లేదు; విద్యను మించిన వరం లేదు" అంటూ వచ్చింది ఈ కథ.

రచన: పేరు-తరగతి లేదు, విద్యానికేతన్, జహీరాబాదు.

రాఘవపురం ప్రక్కనే చక్కని సెలయేరు ఒకటి ప్రవహిస్తూ ఉండేది. ఊళ్ళోవాళ్ళంతా మంచినీళ్ళకోసం ఆ సెలయేరు పైనే ఆధారపడేవాళ్లు.

ఐతే ఒకసారి అకస్మాత్తుగా సెలయేటిలోని చేపలన్నీ వరసగా చనిపోవటం మొదలు పెట్టాయి. నీళ్లపైన తేలుకుంటూ ఎక్కడెక్కడినుండో కొట్టుకు రాసాగాయి

కూడా. అయినా ఊళ్ళోవాళ్ళకు ఆ నీళ్ళే గతి! దాంతో జనం అనారోగ్యం పాలవ్వసాగారు. తెలీని జబ్బులు వ్యాపించసాగాయి. ఒకరొకరుగా జనాలు చనిపోవటం మొదలైంది.



ఐతే 'తమ రోగాలకు కారణం ఏమిటి' అని ప్రజలెవ్వరూ ఆలోచించలేదు. వాళ్ళంతా ప్రధానంగా భయపడ్డారు- భయపడి, తమ సర్పంచ్‌తో మొరపెట్టుకున్నారు. సర్పంచ్ తనకు తెలిసిన మంత్రగాళ్లను అడిగాడు- "మీ ఊరికి పాపం చుట్టుకున్నది. దేవుడు మీ మీద కోపంగా ఉన్నాడు. దుష్ట శక్తులన్నీ మీ ఊళ్ళో తాండవం చేస్తున్నాయి" అని వాళ్ళంతా నమ్మకంగా చెప్పేసారు.

అప్పటికే కంగారు పడుతున్న ప్రజలు మరింత బెదిరిపోయారు. వాళ్ల భయాలకు సర్పంచ్ వత్తాసు పాడాడు. అందరూ ప్రాణాలను అరచేత పట్టుకొని, 'పూజలు-శాంతులు-యజ్ఞాలు' అంటూ పంచాయితీ ధనాన్ని, తాము కూడబెట్టిన డబ్బుల్ని కూడా ఖర్చుచేసారు.

అయినా పరిస్థితిలో మార్పు లేదు- రోగాలు మరింత వ్యాపించటం మొదలు పెట్టాయి. అంత జరిగినా ఏ ఒక్కరూ ఆసుపత్రికి వెళ్ళే ప్రయత్నం చేయలేదు. కారణం వాళ్ళకున్న మూఢనమ్మకం: "ఆసుపత్రులకు వెళ్తే దేవతలకు, దుష్టశక్తులకు మరింత కోపం వస్తుంది" అని!

సరిగ్గా ఆ సమయంలోనే, సర్పంచ్ ఇంటికి చుట్టపు చూపుగా వచ్చాడు, శ్రీశైలం. అతను బాగా చదువుకున్నవాడు; మంచి-చెడు తెలిసినవాడు. రాఘవపురంలో ఏం జరుగుతోందో చూసి, సంగతి అర్థం చేసుకున్నాడు. తన స్నేహితుడైన డాక్టర్ శివకు ఉత్తరం రాసాడు: "ఈ ఊరిని

ఎలాగైనా కాపాడాలి. అందుకు నీ సహాయం కావాలి" అని.

డాక్టర్ శివ కూడా వెంటనే బయలుదేరి వచ్చాడు. ఐతే ఆయన చేత వైద్యం చేయించుకునేందుకు ఊళ్ళోవాళ్ళు ఎవ్వరూ ముందుకు రాలేదు! "ఇది దేవుడి మాయ! దుష్ట శక్తుల ప్రభావం! దీనికి వైద్యం చేయించుకుంటే పరిస్థితి మరింత వికటిస్తుంది" అని గట్టిగా చెప్పారు అందరూ. ఐతే డాక్టర్ శివ తెలివైనవాడు. పల్లెల్లో పరిస్థితి తెలిసిన వాడు. "మీలో చాలామందికి బాగా లేదు కదా; అందుకని ముందుగా నేను ఒక్క నలుగురికి మాత్రం వైద్యం చేస్తాను. నా వైద్యం మూలంగా వాళ్ళు బాగైనారనుకోండి, అటు తర్వాత మిగిలిన వాళ్లకి వైద్యం చేయిద్దురు. అట్లా జగగకపోతే నేను ఇక మిమ్మల్ని ఒత్తిడి చేయను. నిశ్శబ్దంగా ఇక్కడి నుండి వెళ్ళిపోతాను" అని, అందుకు అంగీకరించిన నలుగురైదుగురికి మాత్రం మందులిచ్చాడు. నాలుగు రోజులు గడిచేసరికి వాళ్ళంతా కోలుకోసాగారు. దాంతో ఊళ్ళో జనాలందరికీ అపనమ్మకం వదిలిపోయింది. ఒక్కరొక్కరుగా డాక్టరు దగ్గరికి వచ్చి, మందుల వాడకం మొదలుపెట్టారు. డాక్టరుపట్ల, విజ్ఞానం పట్ల, చదువు పట్ల వాళ్లకు ఒక నమ్మకం ఏర్పడింది.

"అసలు ఎందుకిలా జరిగింది?" అని డాక్టరుగారిని అడిగాడు శ్రీశైలం. "సాధారణంగా ఇట్లాంటి సమస్యలు నీళ్ళతోటే వస్తుంటాయి- ముందుగా వీళ్ళు త్రాగే నీటిని పరీక్షించాలి" అంటూ సెలయేటి లోని నీటిని రెండు బాటిళ్లలో నింపి పరీక్షకోసం ప్రభుత్వం వారి ల్యాబుకు పంపించాడు డాక్టర్ శివ.

మరో వారం గడిచే సరికి పరీక్షా ఫలితాలు వచ్చాయి. జనాల సమక్షంలో రిపోర్టులను పరిశీలించిన శివ, శ్రీశైలం ఇద్దరూ దిగులుగా ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. "మీ ఊరికి దగ్గర్లో ఏమైనా ఫ్యాక్టరీలు ఉన్నాయా?" అడిగాడు డాక్టర్ శివ.

"ఉన్నాయి. మన ఊరునుండి ఏడు

కిలోమీటర్ల దూరంలో ప్లాస్టిక్ ఫ్యాక్టరీ ఒకటి ఉన్నది. ఏమి?" అడిగాడు సర్పంచ్.

"దాని ప్రభావమే ఇదంతా. ఆ కంపెనీ విడుదల చేసే హానికరమైన రసాయనాలు ఈ సెలయేటిలో కలుస్తున్నాయి. వాటి మూలంగా నీటిలో ఉన్న జలచరాలు చనిపోతాయి. వాటిని ఆశించే క్రిములవల్ల నీరుమొత్తం మరింత విషపూరితం అవుతుంది. ఆ నీళ్లని త్రాగేవారికి అందరికీ పలు రకాల వ్యాధులు సంక్రమిస్తాయి, మనుషులు చనిపోవచ్చు కూడా. ఇది దేవుడి మాయ కాదు; దుష్టశక్తుల ప్రభావం కూడా కాదు: ఇవన్నీ మనిషి తెలిసి చేస్తున్న తప్పులు!" వివరించాడు డాక్టర్ శివ.

దాంతో ఊరి ప్రజలకు భయం పోయి, దిగులు పట్టుకుంది. 'గాలి,భూమి, అడవి, నీరు- ఇట్లా అన్నీ కలుషితం అయిపోతుంటే, ఇక మనమూ, నోరులేని జీవాలు ఎట్లా బ్రతికేది?!' అంటూ వాపోయారు.

శ్రీశైలం అన్నాడు- "దిగులుపడి ప్రయోజనం లేదు. మన వనరుల్ని మనమే కాపాడుకోవాలి. హానికరమైన రసాయనాలను వదిలే కంపెనీలను మూయించాలి, చెట్లను బాగా నాటాలి. చిన్న పిల్లలకి, అనారోగ్యంతో ఉన్నవారికి కాచి వడగట్టిన నీటిని త్రాగించాలి. మనకు హాని చేస్తున్న ఈ కంపెనీకి నోటీసులు పంపాలి. దాన్ని మూయించాలని ప్రభుత్వానికి వినతిపత్రాలు అందజేయాలి" అని. అందరూ కదిలి, తమ తమ స్థాయిలలో పోరాటం చేసారు. చివరకు ఆ ఫ్యాక్టరీ మూత పడింది.



ఐదు సంవత్సరాల తరువాత రాఘవపురంలో పిల్లలంతా బడికి పోసాగారు. చాలా మంది పెద్దవాళ్ళు కూడా చదువు నేర్చుకున్నారు. దుష్టశక్తుల్ని నమ్మి చేతులు ముడుచుకొని కూర్చోవటం లేదు- అందరూ వికసించిన బుద్ధితో కార్యతత్పరులయ్యారు!



మార్చిన చెట్టు

రచన: బి.హర్షవాణి, పదవ తరగతి, శాంతి నికేతన్ విద్యాలయ, జహీరాబాద్, తెలంగాణ.

బొమ్మలు:పి.అరవింద్, 9 వతరగతి, రాధ స్కూల్ ఆఫ్ లర్నింగ్, అనంతపురం.



వింధ్య పర్వతాల దగ్గరి అడవుల్లో రాముడు, భీముడు అనే ఇద్దరు దొంగలుండేవాళ్లు. వాళ్ళు రోజూ అక్కడ దారి కాచి, అటువైపుగా పోయే వాళ్ల డబ్బులు, నగలు దోచుకునేవాళ్ళు.

అట్లా దొంగిలించిన సొత్తునంతా ఒక పెద్ద మర్రిచెట్టు తొర్రలో దాచేవాళ్ళు. కొన్ని రోజులకి ఆ మర్రిచెట్టు తొర్ర మొత్తం వీళ్లు దాచిన సొమ్ముతో నిండిపోయింది.

ఆ రోజున రాముడు, భీముడు వచ్చి తమ సొత్తునంతా చూసుకొని మురిసిపోయి, "ఈ తొర్ర నిండిపోయింది కదా, ఇప్పుడు ఏం చేయాలి?" అని మాట్లాడుకున్నారు. బాగా తిని ఉన్నారేమో, మరి అట్లా మాట్లాడు-కుంటూనే, ఆ మర్రిచెట్టు నీడలో చిన్నగా కునికారు..

ఇంతలో "ఇదిగో దొంగలూ! మీరు ఈ సొమ్మునంతా దోపిడీలు, దొంగతనాలు చేసి సంపాదించారు కదా, ఇప్పుడు మరి తొర్ర నిండిపోయింది; దీన్నంతా ఏం చేస్తారు?" అని ఎవరో అడిగారు వాళ్లని.

రాముడు.భీముడు ఉలిక్కిపడుతూ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

"చాలా నాళ్ళ నుండీ చూస్తూన్నాను; ఇంత మందిని ఇబ్బంది పెట్టి, మీరు ఏం సుఖపడతామనుకుంటున్నారు?" అని మళ్ళీ వినిపించాయి మాటలు.

రాముడు భీముడు చకాలున లేచి చెట్టు-చుట్టూ తిరిగి చూసారు. ఎవ్వరూ లేరు! పైన కొమ్మల్లో వెతికారు- ఒక్క పిట్ట కూడా లేదు!

"నేను.. చెట్టుని మాట్లాడుతున్నాను. ఈ తొర్ర నాదే. ఇంతకీ చెప్పండి- ఇంకొకరి శ్రమశక్తినే కదా, మీరు దోచుకుంటున్నది? ఇది న్యాయమా? మీరు అసలు ఇట్లా దొంగతనాలు ఎందుకు చేస్తున్నారో చెప్పండి. కారణం చెప్పకపోతే, మీ గురించి అందరికీ చేప్పేస్తా. రాజభటులు మిమ్మల్ని వదలరు మరి.. చూసుకోండి" బెదిరించింది చెట్టు.

రాముడు, భీముడు నిశ్చేష్టులైపోయారు. ఇన్నేళ్ళలో వాళ్లని ఎవ్వరూ ఇట్లా ప్రశ్నించలేదు మరి.



"వేరే పనిచేస్తే ఇంత సంపాదించలేం కదా?! అందుకే మేము ఈ దారి ఎంచుకున్నాం!" అన్నాడు రాముడు. భీముడు కూడా తల ఊపాడు.

"అంటే మీ ఇద్దరి సుఖం కోసం అంతమంది కష్టార్జితాన్ని స్వాహా చేస్తారన్న మాట. సరే, మీరు ఇంతకాలంగా దొంగిలించిన సొమ్ము లెక్క చూపండి. మీరు జీవితాంతం కూర్చుని తిన్నా అది ఇంకా మిగిలిపోతుంది.

అయినా దొంగసొమ్ముని పెట్టుకున్నందుకు గాను మీరు అడుగడుగునా భయపడుతూ బ్రతుకుతారు. ఎందుకొచ్చిన దొంగతనాలు? సంపాదించుకున్న దానిలోంచి ఎవరికైనా దానం చేయడం నేర్చుకోవాలి గానీ?!" అంది చెట్టు.

"వేరేవాళ్ల కోసం మేం ఎందుకు కష్టపడాలి? దాని వల్ల మాకేంటి, లాభం? వాళ్ళు మాకేం చేసారు?" మొండిగా అడిగారు రాముడు, భీముడు.

చెట్టు నవ్వింది. "మీరు మాకు ఏమిచ్చారని, మేం మీకు నీడను, కాయల్ని, పండ్లను, కట్టెల్ని ఇస్తున్నాం? మీరేమిస్తున్నారు మాకు? చేసే పనులన్నిటికీ ప్రతిఫలం కావాలట- మీకు అసలు తెలివి ఉందా, లేదా?" అడిగింది చెట్టు కోపంగా.

రాముడు, భీముడు తల వంచుకున్నారు. "నువ్వు చెప్పింది నిజమే" అని ఒప్పుకున్నారు. "మేం కూడా నీలాగా ప్రతిఫలాన్ని ఆశించకుండా బ్రతకగల్గితే బాగుండు. ఇతరులకు కనీసం అపకారం చేయకుండా బ్రతికితే బాగుండు" అన్నారు.

"బాగుండు అంటే చాలదు. ప్రయత్నించాలి. ఈరోజు నుండే దొంగతనాలు మానెయ్యాలి" అన్నది చెట్టు గట్టిగా.



అంతలో రాముడికి, భీముడికి ఇద్దరికీ ఒకేసారి మెలకువ వచ్చింది. "ఇది కల!" అనుకున్నారు వాళ్ళు మొదట. కానీ ఇద్దరికీ ఒకే కల, ఒకేసారి ఎట్లా వస్తుంది?

ఏమైతే నేమి, ఆ రోజు నుండి వాళ్ళిద్దరూ దొంగతనాలు మానేశారు. అప్పటివరకూ తాము దొంగిలించిన సొమ్మును తీసుకెళ్ళి రాజుగారికి అప్పగించేసారు. కష్టపడి సంపాదించుకున్నదానితో సంతోషంగా, నిర్భయంగా బ్రతకటం మొదలుపెట్టారు.



రుచిలేని పండు

రచన: 3 వ తరగతి B గ్రూపు పిల్లలు, రాధ స్కూల్ ఆఫ్ లెర్నింగ్, అనంతపురం

బొమ్మలు: పి.భార్గవి,9 వతరగతి.

హరిపురంలో నివసించే పవన్, గణేష్ ఇద్దరూ మంచి మిత్రులు. హరిపురాన్ని ఆనుకునే దట్టమైన అడవి ఒకటి ఉండేది. ఊళ్ళో వాళ్ళందరికీ ఆ అడవి అంటే భయం. ఎవ్వరూ ఆ అడవిలోకి పోయేవాళ్ళు కాదు.


ఒకసారి పవన్, గణేశ్ ఇద్దరూ ఆడుకుంటూ ఆడుకుంటూ తమకు తెలీకుండానే అడవిలోకి ప్రవేశించారు. కొద్దిసేపటికి ఇద్దరికీ చాలా ఆకలైంది: చుట్టూ చూసుకుంటే ఏముంది, ఆకాశమంత ఎత్తైన చెట్లు, పొదలు- అన్ని దిక్కులా ఆవరించి ఉన్నాయి! వాళ్ళకు భయం వేసింది. "ఒరే! ఇక్కడికి ఎందుకొచ్చాంరా? ఎవరూ లేరు, ఇదేదో ఘోరంగా ఉంది?!" అన్నాడు పవన్.

"ఎవ్వరూ లేని చోట్ల దయ్యాలు భూతాలు ఉంటాయిరా! ఇక మనపని ఇంతే!" అన్నాడు గణేశ్.

ఇద్దరూ కొంచెం సేపు అక్కడే నిలబడి ఒకరి

తర్వాత ఒకరు వణికారు. ఆ తర్వాత, కొంచెం తేరుకున్నాక, "తినేందుకు ఏమైనా దొరుకుతాయేమో చూద్దాంరా!" అన్నాడు పవన్,

ఇద్దరూ అటూ ఇటూ చూసారు. అక్కడికి దగ్గర్లోనే వింత చెట్టు ఒకటి కనబడింది. ఆకాశాన్ని అందున్నేంత ఎత్తుగా, పెద్ద పెద్ద ఆకులతో పచ్చగా ఉందది. దాని కాయలు, పళ్ళలో ఒక వింత మెరుపు ఉన్నది.



పవన్, గణేష్ ఇద్దరూ మెల్లగా చెట్టు దగ్గరికి వెళ్ళారు. ఆ పండ్లను చూసిన కొద్దీ వాళ్ళకు ఇంకా ఎక్కువ ఆకలైంది.

గణేష్ గబగబా చెట్టు పైకి ఎక్కి, పండ్లను కోసి, పవన్ దగ్గరికి విసిరాడు. పవన్ ఒక పండును కొరికి చూశాడు. తియ్యగా లేవు- ఏదో ఒక రకమైన చప్పదనం! "ధూ!" అని ఉమ్మేసి, పండును క్రింద పడేసాడు. పైనుండి చూసిన గణేష్ ఇక కోయటం ఆపి చెట్టు దిగి వచ్చాడు. మెరిసే పళ్ళని చూస్తూ, "ఇట్లా అవుతుందనుకోలేదురా! ఇప్పుడెలాగ? ఇవన్నీ వదిలేసి ముందుకు పోదాం! త్వరగా ఇల్లు చేరుకుంటే అదే చాలు!" అన్నాడు.

అంతలో ఏదో మెరుపు మెరిసినట్లయింది. ఇద్దరూ గట్టిగా కళ్ళు మూసుకున్నారు. కళ్ళు తెరిచి చూస్తే ఆశ్చర్యం- తమ చుట్టూ చెట్లు లేవు! ఇద్దరూ తమ ఊరి పొలిమేర దగ్గరే నిలబడి ఉన్నారు! పవన్ వాళ్ళ తాత, వాళ్లని వెతికేందుకు వచ్చిన మనుషులు అందరూ వాళ్లకేసి అనుమానంగా చూస్తున్నారు.

"ఇక్కడికెట్లా వచ్చాం? ఆ చెట్టేది?" అని అరుస్తున్న పిల్లలకేసి జాలిగా చూసారు పెద్దవాళ్ళు. అంతలోకే వాళ్ళ చూపులు చుట్టూ నేలమీద పడి ఉన్న పండ్లమీద పడ్డాయి.

తాత ఒక పండును చేతిలోకి తీసుకొని ఆసక్తిగా చూసాడు. "ఈ పండ్ల చెట్టే, నేను ఎక్కింది! ఏదీ ఆ చెట్టు?" అరిచాడు గణేష్.

అంతలోకే తాత ఏదో అరవటం, అక్కడ చేరిన పెద్దవాళ్లంతా గబగబా క్రింద పడిన పండ్లను ఏరుకొని ఎవరి దారిన వాళ్లు పరుగు పెట్టటం చకచకా జరిగిపోయాయి.

పిల్లలిద్దరూ ఆశ్చర్య పోయారు.

తర్వాత చెప్పాడు తాత: ఆ పండ్లలోపలి టెంక అంతా మేలిమి బంగారం! ఇట్లాంటి పండ్ల గురించి కథల్లో చదవటమే తప్ప, నిజంగా ఎవ్వరూ చూసి ఉండలేదు! ఇప్పుడు అకస్మాత్తుగా అవి కనిపించే సరికి, జనాలంతా ఎవరికి దొరికినన్ని వాళ్ళు ఎత్తుకుపోయారు!



"అయితే నేమి? బంగారం పండ్లు తినడానికి పనికిరావు!" అని గట్టిగా నవ్వారు పవన్-గణేశ్, వాళ్ళ తాత తెచ్చిచ్చిన మామూలు పండుని కొరికి తింటూ. ★

చిలిపి ప్రశ్నలు:

1. యూపీ ఉర్లగడ్డ(బంగాళా దుంప) ఫోన్ ఎత్తగానే ఏమంటుంది?
2. గుజరాతీ మనిషి పూలరెక్కల్ని ఇంగ్లీషులో ఏమంటాడు?
4. అందరూ నమస్కరించే కాలు ఏమిటి?
5. వీటిలో మూడో ప్రశ్న ఎక్కడికి పోయింది?

జవాబులు: 1. ఆలూ! 2. పటేల్స్! 3. పుస్తకాలు! 4. షికారుకు!


తల తిక్కపట్టించే కథ

బొమ్మల కథ

ఈ తల తిక్క పట్టించే కథ మీకు అర్థం అయ్యిందా? ఇదెలా సాధ్యమో చెప్పండి మరి ?!

మూలం :అజయ్, రిషివ్యాలీ స్కూల్. *సవరణ: కొత్తపల్లి.*

బొమ్మలు : పి.సుహాసిని, 9 వతరగతి, రాధ స్కూల్ ఆఫ్ లర్నింగ్



ఒక రోజు సునీత తన తమ్ముళ్ళతో పాటు సినిమాకు వెళ్ళింది. తిరిగి వచ్చేటప్పటికి సాయంత్రం అయ్యింది.

ఇంట్లో అమ్మ లేదు. ఇంటి తలుపు తాళం తీస్తూ వెనక్కి తిరిగి చూసింది. అందమైన సూర్యాస్తమయం ఒకటి కనబడింది.





ఇంట్లోకి వెళ్ళాగానే, కొంచెం నడుం వాల్చింది సునీత.

కిటికీలోంచి ఆ సూర్యాస్తమయాన్నే చూస్తూండగా నిద్రపట్టింది.



రాత్రయింది. సునీత సినిమానుండి వెనక్కి వచ్చింది. ఇంటి బయట ఎవరో నిల్చొని ఉన్నారు.



సునీత ఇంట్లోకి వెళ్తుంటే తనకేసే చిత్రంగా చూసారు వాళ్ళు. బయట నిల్చోని, లోపల ఉండేవారిని తను అడిగింది "సునీత ఇంటికి వచ్చిందా?" అని.

అంతలో సునీత వాళ్ళ అమ్మ కనిపించింది. "సునీత ఇంటికి ఎప్పుడో వచ్చింది!" అన్నది.

"అరే! సునీత ఇంట్లోనే ఉన్నదట! మరి నేనెవరు?!" అనుకుంటూ ఉలిక్కిపడి నిద్రలేచింది సునీత!



పొదుపు!

శంభులింగం: ఏంటి జంబూ?! క్షవరం అంత చిన్నగా చేయించావు?

జంబులింగం: ఏంలేదు శంభూ, ఆ మంగలాయన దగ్గర నాలుగు రూపాయలు చిల్లర లేదన్నాడు. అట్లా అయితే ఆ నాలుగు రూపాయలకు సరిపడా కత్తిరించమన్నా!

చీమ మనిషి!

వరుణ్: చీమలను ఎందుకురా ఫాలో అవుతున్నావు?

వాసు: స్వీట్ ప్యాకెట్ ను అమ్మ దాచిపెట్టేసిందిరా. చీమల బారును అనుసరిస్తే అవే స్వీట్ దగ్గరికి తీసుకుపోతాయని!



మంచి మనిషి

బౌద్ధ కథ

మూలం : బుద్ధిస్ట్ టేల్స్ *అనుసరణ : నారాయణ, కొత్తపల్లి బృందం.*
చిత్రాలు : పి.భార్గవి, 9 వతరగతి, రాధ స్కూల్ ఆఫ్ లర్నింగ్, అనంతపురం.



బుద్ధుడు భారతదేశ మంతటా పయనిస్తూ ధర్మాన్ని బోధిస్తూన్న రోజులవి. లక్షలాది మంది ఆయన మార్గాన్ని అనుసరించటం మొదలుపెట్టారు. యజ్ఞాల్నీ, క్రతువుల్నీ, జంతుబలినీ వదిలి పెట్టసాగారు. ఎక్కడ చూసినా బుద్ధుని గురించిన చర్చలే వినిపించేవి: సనాతన ధర్మాన్ని వదిలేసే వాళ్ళ గురించిన ముచ్చట్లే వినబడేవి.

శ్రావస్తి నగరంలో కూడా జనాలు తండోప

తండాలుగా బుద్ధుని వైపుకు మరలారు. ఆ నగరంలో భరద్వాజుడు అనే ముసలి బ్రాహ్మణుడి ఇంట్లో అయితే అతని భార్య, కొడుకు, కోడలు- అందరూ బుద్ధుని బాటే పట్టారు! ముసలి భరద్వాజుడు ఒక్కడే ఇంకా తన మతాన్ని పట్టుకొని నిలిచాడు.

సంప్రదాయాల్నీ, సంస్కృతినీ వదిలి, 'పర ధర్మాన్ని' చేబూనిన కుటుంబాన్ని తలచుకొని కుమిలిపోయాడు ముసలాయన.



"దీని కంతటికీ కారణం బుద్ధుడే" అనుకునే-సరికి ఆయనకు విపరీతమైన కోపం వచ్చేసింది. "తప్పదు- ఈ బుద్ధుడిని చంపేయకపోతే సమాజం పూర్తిగా నాశనం అయిపోతుంది" అని భరద్వాజుడు రోకలి బండను ఒకదాన్ని చేత బట్టుకొని, బుద్ధుడుండే చోటికి బయలుదేరాడు.

సగం ముసలితనంతోటీ, సగం కోపంతోటీ వణుక్కుంటూ వచ్చిపడుతున్న భరద్వా-జుడిని అడ్డుకోబోయారు, బుద్ధుడి చుట్టూ ఉన్న శిష్యులు. బుద్ధుడు వాళ్ళందరినీ వారించి, ముసలాయన్ని పిలిచి దగ్గర కూర్చో బెట్టుకొని, కాసిని మంచినీళ్ళిచ్చి, "సంగతేంటో చెప్పు తాతా! ఏదో విషయం నిన్ను బాగా పీడిస్తున్నది. ఏంటది?" అన్నాడు.

"నేను నీతో మాట్లాడేందుకు రాలేదు. ఈ రోకలి బండతో ఒక్కటి ఇచ్చానంటే నీ తల వెయ్యి చెక్కలౌతుంది!" అరిచాడు భరద్వాజుడు.

"ఎందుకు తాతా, అంత కోపం? ఏం కష్టం వొచ్చింది?" అన్నాడు బుద్ధుడు. ఆయన ముఖంలో శాంతి చెక్కు చెదరలేదు; ఏమాత్రం అదురు, బెదురు లేవు.

"నువ్వు అందరినీ మాయ చేస్తున్నావు. వాళ్ళకు ఏవేవో నేర్పిస్తున్నావు. సమాజాన్ని పూర్తిగా భ్రష్టు పట్టిస్తున్నావు. ఇవాల్టితో నీ పని ముగించాలనే వచ్చాను" ఇంకాగట్టిగా అరిచాడు భరద్వాజుడు.

బుద్ధుడు చిరునవ్వు నవ్వాడు. "అయ్యో, అట్లాంటిదేమీ లేదు- నీకు తెలుసో, లేదో- నేను అందరికీ కేవలం మూడు సంగతులు నేర్పిస్తున్నాను-

ఒకటి: నీతిగా బ్రతకటం ఎలాగో చెబుతాను;

రెండు: ఏకాగ్రతను ఎలా సాధించాలో నేర్పిస్తాను;

మూడు: జ్ఞానం ఎలా వికసిస్తుందో నేర్పిస్తాను;

'శీల- సమాధి - ప్రజ్ఞ' లనే ఈ మూడూ తప్ప నేను మరో సంగతి మాట్లాడనే మాట్లాడను. అయినా వేరేవేవో మాట్లాడేంత సమయం ఎక్కడుంది నాకు?!" అన్నాడు బుద్ధుడు; ధర్మమార్గాన్ని వివరిస్తూ.

బుద్ధుడి ప్రశాంతతని చూసి భరద్వాజుడి కోపం కొంచెం చల్లబడింది. "నువ్వు చెప్పిన మూడూ ఎవరికైనా, ఏనాటికైనా సాధించాల్సినవేగా, ఇక నువ్వు కొత్తగా చెబుతున్నది ఏముంది?" అన్నాడతను, విడిచిపెట్టకుండా.

"అదే తాతా! నేను చెప్పేది కూడా అదే! ఈ మూడూ ఎట్లా చేయాలో ఆ పద్ధతి ఏదో నాకు తెల్సింది కనుక, అడిగినవాళ్ళందరికీ నేర్పిస్తున్నాను. నువ్వు అడిగితే నీకు కూడా నేర్పిస్తాను- దానిదేముంది?" అన్నాడు బుద్ధుడు, చిరునవ్వుతో.



"ఒరే మనవడా! నిజంగానే నీకేదో విద్య

వచ్చురా! లేకపోతే అంత కోపంగావచ్చిన వాడిని నన్ను ఇంతలా ఎట్లా మాయచేస్తావు?" అన్నాడు భరద్వాజుడు ఆశ్చర్యపోతూ.

"ఇందులో మాయ ఏమీలేదు తాతా! నువ్వు ఎవరికైనా ఏదైనా ఒక బహుమతి తీసుకెళ్ళావనుకో; అది వాళ్ళు స్వీకరించలేదనుకో; అప్పుడింక ఆ బహుమతికి ఏమౌతుంది?" అడిగాడు బుద్ధుడు.

"ఏమౌతుంది? అది నా దగ్గరే ఉంటుంది!" అన్నాడు భరద్వాజుడు.

"అదే తాతా, నేను అనేది కూడా. నువ్వు నాకోసం ఇంత కోపాన్ని మోసుకొచ్చావు. నేను ఆ కోపాన్ని స్వీకరించలేదు! మరి ఇప్పుడు ఆ కోపం ఏమౌతుంది?" నవ్వాడు బుద్ధుడు.

భరద్వాజుడు ఆలోచనలో పడ్డాడు. "తను నీతిగానే బ్రతుకుతున్నాడు. చాలా శాస్త్రాలు చదివాడు. కానీ తనకి ఏకాగ్రత నిలవటం లేదు. ప్రజ్ఞ జాగృతం కాలేదు. ఇతన్ని చూస్తే నిజంగానే గొప్పవాడిలాగా ఉన్నాడు. ముఖ్యంగా కోపాన్ని తీసుకోకపోవటం- అది చాలా గొప్ప విద్య. ఇతనేదో నిజంగానే అన్నీ తెలిసిన వాడిలాగా ఉన్నాడు.. మెల్లగా అడిగితే నాకు కూడా నేర్పిస్తాడేమో.." అని.

బుద్ధుడు అతని మనసును పసిగట్టాడు.

"తాతా కూర్చో. నిటారుగా కూర్చో. శరీరాన్ని వదులుగా, నిశ్చలంగా ఉండనీ. వచ్చే-పోయే శ్వాసను ఎక్కడా బిగబట్టకు! గమనించు!" అంటూ తన పాఠం మొదలుపెట్టాడు.



తల పగలగొడదామని వచ్చిన భరద్వాజుడు ఊరికే చల్లబడటం మాత్రమే కాదు;

ఇతరులనుండి కోపాన్ని తీసుకోకుండా ఉండే విద్యను చాలా బాగా సాధన చేశాడు. త్వరలోనే వేలాదిమందికి విశుద్ధ మార్గాన్ని బోధించే అర్హతుడు అయ్యాడు.

మంచి మనుషులు అలా ఉంటారు. వాళ్ల దారిలో అడుగులు వేసే వాళ్లందరూ కూడా మంచి వాళ్ళైపోతారు.

మంచితనానికి తనదైన శక్తి ఏదో ఉంది- నిజంగా!

మీకు తెలుసా? రక రకాల పండుగలు!

చాలా సంవత్సరాల నుంచి నూతన సంవత్సరం వస్తూంది! 'నూతన' అంటే కొత్త. కాబట్టి, నూతన సంవత్సరం అంటే కొత్త సంవత్సరం అన్నమాట. 12 నెలలు కలిస్తే వచ్చేది సంవత్సరం. ఏసు క్రీస్తు పుట్టినప్పటినుండి ఇప్పటికి 2017 సంవత్సరాలు జరిగాయి.

ఇది కాక మనం ప్రతి సంవత్సరం ఇంకా చాలా పండుగలు జరుపుకుంటాం.

వీటిలో సంక్రాంతి, దీపావళి, వినాయక చవితి- ఇవన్నీ ముఖ్యంగా హిందువుల పండుగలు; గుడ్‌ఫ్రైడే, క్రిస్మస్- క్రైస్తవుల పండుగలు, రంజాన్, బక్రీద్- ఇవి ముస్లిమ్‌ల పండుగలు. సంక్రాంతి పండుగలో కోడి పందాలు, ఎడ్ల పందాలు, గుర్రపు పందాలు జరుగుతాయి. రంజాన్ పండుగకు ముందు నెలరోజులపాటు ఉపవాసం ఉంటారు. పండుగ రోజున మేకలని బలి ఇచ్చి, ఆ మాంసంతో కూర వండుకుంటారు. ఆరోజున ముస్లిములు అందరూ శక్తి కొద్దీ దానం చేస్తారు. క్రిస్మస్ రోజున చర్చిలో ప్రార్థనలు చేస్తారు. కొత్త బట్టలు వేసుకొని సంతోషంగా ఉంటారు. పిల్లలంతా క్రిస్మస్ తాతవచ్చి బహుమతులు ఇస్తారని నమ్ముతారు- (కానీ అసలైతే పెద్దవాళ్ళు రహస్యంగా ఆ బహుమతులు తెచ్చి పెడతారు!)

ఇక అన్ని మతాలు వారూ కలిసి జరుపుకొనే పండుగ స్వాతంత్ర్యదినోత్సవం; మన ప్రభుత్వం, సైన్యం జరుపుకునే పండుగ గణతంత్ర దినోత్సవం.

-డింపుల్,పుండరి,5వ తరగతి, వికాస విద్యావనం



ముగ్గురు మూర్ఖులు

అనువాద కథ

మూలం : స్టోరీ నోరీ డాట్ కాం. తెలుగు అనుసరణ: నారాయణ, కొత్తపల్లి బృందం

చాలా కాలం క్రితం వెంగళప్ప రైతుగా ఉన్న కాలంలో అతనికి ఒక భార్య, ఒక కూతురు ఉండేవాళ్ళు: భార్య వెంగళమ్మ, కూతురు వెంగమాంబ.

వెంగమాంబ పెళ్లి యీడుకు వచ్చింది. దాంతో వెంగళప్ప అల్లునికోసం బాగా వెతికి వెతికి, చివరికి టౌనులో పని చేసే రాముడు తన అల్లుడిగా వస్తే బాగుంటుందని నిశ్చయించాడు.

ప్రతి రోజూ సాయంత్రం కాగానే రాముడు వెంగళప్ప ఇంటికి వచ్చేవాడు. అంతా కలసి కుర్చొని, టీ తాగుతూ ముచ్చట్లు పెట్టుకునే వాళ్లు. పశువుల శాలలో నుంచి అప్పుడే పిండిన గుమ్మ పాలు తెచ్చి, చిక్కటి "టీ"

చేసి పెట్టే వెంగమాంబ అంటే సహజంగానే ఇష్టం అయింది రాముడికి.



అట్లా ఒక సారి పాలు తెచ్చేందుకు పశువుల శాలలోకి వళ్లిన వెంగమాంబ, కొట్టం పైకప్పు వైపుకు చూసింది.

అక్కడ ఓ వాసానికి వేలాడుతూ కనిపించింది- ఒక గొడ్డలి! అది అక్కడ చాలా కాలంగానే ఉండి ఉండాలి; కాని ఈమె దాన్ని ఇప్పుడే, చూడటం.

గొడ్డలిని చూసిన కొద్దీ ఆమె మనసులో ఆలోచనలు తిరుగాడటం మొదలైంది: "ఈ గొడ్డలి.. ఇక్కడ ఎందుకుంది? ఇది ఇట్లా వ్రేలాడుతూ ఉండటం ఎంత ప్రమాదకరమో కదా?! నాకూ రాముడికీ పెళ్ళి అయ్యిందనుకో; మాకు ఒక కొడుకు పుట్టాడనుకో; వాడు పెద్దయ్యాడనుకో; వాడు కూడా నా మాదిరే, పాలు తెచ్చేందుకు ఈ కొట్టంలోకి వచ్చాడనుకో; అప్పుడు వాడి నెత్తిమీద ఈ గొడ్డలి పడితే-.. ఎంత ఘోరం జరిగిపోతుంది?!" ఈ ఆలోచనతో ఆమె నోరు ఎండిపోయింది; పెదవులు ఆరాయి; ఉన్నది ఉన్నట్లు కూలబడిపోయి వెక్కివెక్కి ఏడవటం మొదలుపెట్టింది.

బిడ్డ ఎంతకీ రాకపోయేసరికి వెంగళమ్మ తనే పోయి చూసింది. అక్కడ ఏడుస్తున్న వెంగమాంబను చూసి ఆమెలోనుండి దు:ఖం తన్నుకొచ్చింది.

"ఎంత కష్టం రాకపోతే మరి, తన బిడ్డ ఇట్లా పశువుల కొట్టంలోకి వచ్చి కూర్చొని ఏడుస్తుంది?" అనుకున్నది. "ఏమైంది, తల్లీ? ఏమైంది? చెప్పు!" అని అడిగింది బొంగురు గొంతుతో.

"అయ్యో అమ్మా, ఏం చెప్పేది! అదిగో ఆ దుష్ట గొడ్డలిని చూడు! నాకూ, రాముడికీ పెళ్ళి అయ్యిందనుకో; మాకు ఒక కొడుకు పుట్టాడనుకో; వాడు పెద్దయ్యాడనుకో; నాలాగే వాడు కూడా పాలు తెచ్చేందుకు ఇక్కడికి వచ్చాడనుకో; ఇంత లావు గొడ్డలి వాడి నెత్తిన పడితే, ఇక నిలుస్తాయా, వాడి ప్రాణాలు?!" అని బిగ్గరగా ఏడ్చింది.

అది విని వెంగళమ్మకు కూడా దు:ఖం వచ్చేసింది. ఆమె కూడా అక్కడే కూలబడి ఏడవసాగింది.

ఎంతకీ వీళ్ళిద్దరూ రాకపోవటంతో ఈసారి స్వయంగా వెంగళప్ప వచ్చాడు కొట్టంలోకి- "ఏమైంది? ఏమైంది?!" అంటూ.

"ఆ దుష్ట గొడ్డలిని చూడు! ఊహించు!! మన అమ్మాయికి రాముడితో పెళ్ళి అయ్యిందనుకో, వాళ్ళకు ఒక కొడుకు పుట్టాడనుకో; వాడు పెద్దయ్యాడనుకో; పాల కోసం ఇక్కడికి వచ్చాడనుకో; ఈ దుష్ట గొడ్డలి వాడి పైన పడిందనుకో, వాడు నిలువునా చనిపోడా? ఎంత ఘోరం, ఎంత అమానుషం!" అని ఏడుస్తూ గొడ్డలిని కసితీరా తిట్టింది వెంగళమ్మ. అది వినగానే వెంగళప్ప పై ప్రాణాలు పైనే పోయాయి: "అయ్యో దేవుడా, ఎన్ని కష్టాలు తెచ్చిపెడుతున్నావు!" అంటూ తను కూడా అక్కడే కూలబడి మొత్తుకోవటం మొదలెట్టేసాడు.

ఇక అక్కడ వంటగదిలో చాలాసేపు నిల్చున్న రాముడికి వీళ్లంతా ఏం చేస్తున్నారో అర్థం కాలేదు. అంతలోనే వాళ్ళ ముగ్గురి ఏడుపులూ వినిపించే సరికి అతనికి భయం వేసింది. "ఇంతకీ ఇక్కడ ఏమి జరుగుతోందో చూడాల్సిందే!" అని అతను పశువుల పాకలోకి వచ్చాడు. అక్కడ ముగ్గురికి ముగ్గురూ కూర్చుని ఏడుస్తూ ఉండటం,

పాలన్నీ ఒలికిపోయి ఉండటం చూసి ఏదో ఊహించరాని ఘోరమే జరిగిందనుకొని, "ఏమైంది!? ఎందుకు ఏడుస్తున్నారు?" అని అడిగాడు ఆత్రంగా.

"అయ్యో, ఏమి చెప్పాలి?! ఆ దుష్ట గొడ్డలికేసి ఒక్కసారి చూడు! నీకు, మా అమ్మాయికీ పెళ్ళి అయ్యిందనుకో; మీకు ఒక కొడుకు పుట్టాడనుకో; వాడు పెద్దయ్యి, పాలకోసం ఇక్కడికి వచ్చాడనుకో; ఈ గొడ్డలి జారి వాడి నెత్తిమీద పడితే,.. వాడు నిలువునా కూలిపోతే...." అని వెంగళప్ప అనటమేమిటి, మిగిలిన ఇద్దరితో బాటూ అతను కూడా ఒక్కసారిగా శోకాలు పెట్టడం మొదలుపెట్టటమేమిటి- తటాలున జరిగిపోయినై.


అయితే రాముడు బిగ్గరగా నవ్వేసి, దగ్గరలోనే ఉన్న ఒక బల్లనెక్కి, కప్పు నుండి వ్రేలాడుతూఉన్న గొడ్డలిని తీసి కింద పడేస్తూ "నేను చాలా పల్లెలే చూసాను కానీ, మీ అంత తిక్కవాళ్ళని మటుకు ఎక్కడా చూడలేదు. ఇప్పుడు మళ్ళీ ఒక సారి ఊళ్లన్నీ చుట్టి వస్తాను. ఎన్ని ఏళ్లైనా పట్టనీండి; మీకంటే మూర్ఖులు కనీసం ముగ్గురన్నా కనబడేంతవరకూ తిరిగి వచ్చేది లేదు. ఒకసారి అట్లాంటి గొప్పవాళ్ళు ఎక్కడైనా కనిపించారంటే, అప్పుడిక తిరిగివచ్చేసి, మీ అమ్మాయినే పెళ్ళి చేసుకుంటాను" అని గుర్రమెక్కి బయలుదేరి పోయాడు.

'గొడ్డలి భయంతో పాటు ఇంటికి వచ్చిన అల్లుడు కూడా పోయాడే!' అన్న బాధతో వీళ్ళు ముగ్గురూ మళ్ళీ ఒక సారి బిగ్గరగా ఏడ్చారు.

అట్లా కొన్నాళ్ళు పోయాక రాముడికి ఒక అవ్వ కనిపించింది. అవ్వ ఇంటిమీద చవుడు మట్టి వేసి ఉన్నది. ఆ మట్టిలో కొంచెం గడ్డి పెరిగి ఉన్నది. అవ్వ ఇంటికి ఒక నిచ్చెన వేసింది. ఆవుని ఒక దాన్ని ములుగర్రతో తోలుతూ, దాన్ని నిచ్చెన పైకి ఎక్కించేందుకు తంటాలు పడుతున్నది ఆ అవ్వ.

"ఏమైందవ్వా, ఎందుకు, ఆ ఆవును అంత కష్టపెడుతున్నావ్?" అన్నాడు రాముడు.

"కళ్ళు కనిపించట్లేదా! మిద్దె మీద అంత గడ్డి ఉంటేనూ!?" అన్నది అవ్వ.



"పైకి ఎక్కితే ఏం లాభం?! క్రింద పడిపోదా?! పిట్ట గోడ కూడా లేదు కదా!" అని నవ్వాడు రాముడు.

"అందుకేగా, నేను ఇట్లా దాని మెడకు ఒక తాడును కట్టింది; ఆ తాడును పొగ గొట్టంలోనుంచి కిందికి తెచ్చి, నా నడుముకు కట్టుకున్నది?! అన్నది అవ్వ గర్వంగా.

రాము ఎంత వారిస్తున్నా వినకుండా అవ్వ ఆవును మేడ మీదికి ఎక్కించింది. అయితే పైకి చేరగానే ఆవు కాస్తా ఎగిరి గంతేసి, రెండో వైపు నుండి ధబేలున కింద పడిపోయింది! దాని ముకుతాడు రెండో కొసకు కట్టబడి ఉన్న నడుముతో సహా అవ్వ, రయ్యిమంటూ పొగ గొట్టంలోకి రాకెట్‌లా దూసుకొని పోయింది!

పొగ గొట్టంలో ఇరుక్కొని మొత్తుకుంటున్న అవ్వను విడిపించేందుకు ఊళ్లో వాళ్లు సగం మంది వచ్చాక, రాముడు ఊపిరి పీల్చుకొని, "ఆహా! మా వాళ్ళను మించిన తిక్క వాళ్ళు ఉండరేమో అనుకున్నాను. నిజంగానే ఉంది ఒకామె!" అని మురిసిపోతూ మరో ఊరికి బయలు దేరాడు.

అట్లా పోయి పోయి, ఆ రోజు చీకటి పడేసరికి ఒక సత్రం చేరుకున్నాడు రాముడు. ఆ సరికే సత్రంలో బస చేసి ఉన్న యువకుడు ఒకడు అతన్ని మర్యాదగా

పలకరించాడు. ఇద్దరూ భోజనం చేసి పడుకున్నారు.

తెల్లవారి లేచేసరికి వింత దృశ్యం ఒకటి కనపడింది రాముడికి: తాము పడుకున్న రెండు మంచాలకూ కట్టి, వేలాడుతూ ఉన్నది- ఒక ప్యాంట్! ఆ కుర్రవాడు చెడ్డీలోనే పరిగెత్తుకుంటూ వచ్చి, పైకి ఎగిరి- ప్యాంటు మీదికి దూకుతున్నాడు. అట్లా దూకటం దూకటంలోనే కాళ్ళను నేరుగా ప్యాంటులోకి దూర్చాలని వాడి ప్రయత్నం! అయితే ఎన్ని సార్లు పరిగెత్తికొచ్చి దూకినా, కాళ్ళు మాత్రం ప్యాంట్‌లోకి దూరడం లేదు. అయినా వాడు పట్టు వదలట్లేదు; మళ్ళీ మళ్లీ దూకుతున్నాడు. కొద్ది సేపటికి అతను దూకటం ఆపి చెమట తుడుచుకుంటుం-డగా, "సంగతేంటి?!" అని అడిగాడు రాముడు.

"అయ్యో! ఏం చెప్పాలి మిత్రమా?! ప్రతి రోజూ నాకు ఈ శ్రమ ఏమాత్రం తప్పట్లేదు. ఈ ప్యాంటుల్ని ఎవడు కనుకున్నాడో గాని, వీటిలోకి కాళ్ళు దూర్చేందుకు రోజూ నాకు ఒక గంట సమయం పడుతున్నది" అని చెప్పి, "నీకెంత సమయం పడుతుంది?" అని అడిగాడు కుర్రాడు.

రాముడు బిగ్గరగా నవ్వి ప్యాంటును ఎలా వేసుకోవాలో చూపించాడతనికి. అది చూసి ఆ కుర్రవాడు విపరీతంగా ఆశ్చర్య పోవటమే కాక, "ఆహా! మీరు మేధావులు! మీ అంత తెలివైన వాళ్ళని నేను ఇప్పటివరకూ చూడలేదు" అంటూ ఆజన్మ శిష్యుడు అయిపోయాడు.

"ఆహా! ఎవరూ ఉండరనుకుంటే, నాకు రెండో మూర్ఖుడు కూడా దొరికాడు!" అనుకుంటూ ఇంకొంచెం ముందుకు వెళ్ళాడు రాముడు.

ఈ సారి అతనికి ఓ ఊరి పొలిమేరల్లో, చెరువు దగ్గర గుమికూడి ఉన్న మనుషులు కన్పించారు. అందరి ముఖాలలోనూ ఆందోళన! అది చూసి రాముడు వాళ్ళ దగ్గరకు వెళ్ళి, "ఏమైంది? ఎవరైనా చెరువులో పడ్డారా?" అని అడిగాడు.

"అవును- నిన్న రాత్రనగా పడ్డాడు! ఇంకా పైకి తేలలేదు" చెప్పారు వాళ్ళు.

వాళ్ల ఆందోళనలో భాగం పంచుకొన్న రాముడు కొద్ది సేపటి వరకూ అక్కడే ఆగిపోయి, కొద్దిసేపు వాళ్ళతో మాట్లాడాడు. అప్పుడు గానీ అర్థం కాలేదు అతనికి: వాళ్ళు గాలిస్తున్నది. చంద్రుడి కోసం! "చంద్రుడు నిన్న రాత్రనగా ఈ చెరువులో జారిపడిపోయాడు. ఎంత ప్రయత్నించినా పైకి లాగలేకపోతున్నాము" అన్నారు వాళ్ళు.

"ఒరే! చెరువులోకి దూరింది చంద్రుడి ప్రతిబింబం మాత్రమే రా! అసలు చంద్రుడు ఆకాశంలో భద్రంగానే ఉన్నాడు" అని చెప్ప చూసాడు రాముడు.

అయితే వాళ్ళు ఎవరూ అతని మాటలు వినక పోవటమే కాక; కత్తులు కటార్లతో అతని మీదికే దాడికి వచ్చారు!

"బ్రతుకు జీవుడా" అని వెనక్కి పారిపోయిన రాముడికి "వీళ్ళందరికంటే వెంగమాంబే చాలా నయం!" అనిపించింది. ఈ మూర్ఖుల్ని చూసాక అతని కళ్ళు తెరుచుకున్నాయి. అటుపైన అతనికి, వెంగమాంబకు వైభవంగా పెళ్లి జరిగింది.

వెంగళప్ప: మా అబ్బాయి పర్ఫెక్ట్ తెలుసా?

రామయ్య: మీ వాడు స్మోక్ చేస్తాడా?

వెంగళప్ప: లేదు.

రామయ్య: మరి మందు తాగుతాడా?

వెంగళప్ప: లేదు.

రామయ్య: పోనీ ఇంటికి లేట్ గావస్తాడా?

వెంగళప్ప: అబ్బే! ఆ సమస్యే లేదు.

రామయ్య: నాకు తెలిసి మీ అబ్బాయి పర్ఫెక్టే. మీవాడి వయసెంత?

వెంగళప్ప: వచ్చే బుధవారానికి ఐదు నిండి ఆరు నెలలొస్తాయి.

రామయ్య:ఆ!?



సామెతలు:

బూడిదలో పోసిన పన్నీరు!

చింత చచ్చినా పులుపు చావదు!

దేవుడు వరమిచ్చినా పూజారి వరం ఇవ్వలేదు!


అందితే జుట్టు- అందకపోతే కాళ్ళు!

గోరు చుట్టుపై రోకలి పోటు

దెయ్యాలు వేదాలు వల్లించినట్లు

గుడినే మింగేవాడికి లింగం ఒక లెక్కా?

-హరిజన గమన, 7వ తరగతి, ZPHS కోగిర



సరైన పాలకుడు

రచన: అశోక్, కొత్తపల్లి బృందం.
బొమ్మలు: పి.సుహాసిని, 9 వతరగతి,రాధ స్కూల్ ఆఫ్ లర్నింగ్, అనంతపురం.

చాలా కాలంక్రితం దక్షిణాపథానికి విజయసింహుడు అనే చక్రవర్తి ఏలికగా ఉండేవాడు. ప్రజలకు ఎలాంటి లోటూ రానివ్వకుండా పరిపాలించేవాడు ఆయన.

వర్షాలు సమృద్ధిగా పడటం వల్ల రాజ్యం అంతా సిరి సంపదలతో సుభిక్షంగా ఉండేది. ఆయన ఏలుబడి క్రింద అనేక సామంత రాజ్యాలు ఉండేవి. ఎందరో రాజులు ఆయనకు లోబడి నడచుకునేవాళ్ళు.

ఒకరోజు విజయసింహునికి ఒక ఆలోచన వచ్చింది: "మనకు ఇంతమంది సామంతులున్నారు- అయినా వాళ్ళకు ఒకరంటే ఒకరికి సరిపోవట్లేదు.

పొరపొచ్చాలు రావటానికి ప్రధాన కారణం, వాళ్ళకు ఒకరి గురించి ఒకరికి తెలియక పోవటం. అందువల్ల మనం త్వరలో ఒక విందును ఏర్పాటు చేసి, వాళ్లందరినీ ఆహ్వానిద్దాం! వాళ్లంతా ఒకరితో ఒకరు కలిసి

చర్చించుకునే సందర్భాన్ని కల్పిద్దాం.

అట్లా చేస్తే వాళ్లందరి మధ్య సయోధ్య కుదురుతుంది; ఒకరికొకరు మిత్రులౌతారు. అదే సందర్భంలో వాళ్ళు ఏ విధంగా పరిపాలిస్తున్నారో వాళ్ల నోటి ద్వారానే విందాం! గొప్పగా పరిపాలిస్తున్న రాజ్యాధినేతలను గౌరవిస్తూ, ప్రోత్సాహక బహుమతులు ఇద్దాం!" అని.

వెంటనే మహామంత్రి వివిధ రాజ్యాధీశులందరికీ పేరు పేరునా ఆహ్వానాలు పంపించాడు. అనేకమంది రాజులు, సామంతులు, ఆయా రాజ్యాలలోని ధనికులు- అందరూ విజయసింహ మహారాజు నిర్వహిస్తున్న విందుకు విచ్చేసారు.

మహారాజుతో సహా అందరూ వారికి గౌరవంగా స్వాగతం పలికి తగిన వసతులు ఏర్పరచారు. ఆరోజు విందు ముగిసిన తరువాత, మహామంత్రి లేచి, వివిధ రాజ్యల నుంచి వచ్చిన రాజులను ఉద్దేశించి మాట్లాడుతూ "ఆర్యులారా! మా ఆహ్వానం అందుకొని మీరంతా విచ్చేసినందుకు చాలా సంతోషంగా ఉంది. ఇప్పుడు తమరు కొంత సమయం తీసుకొని తమరి గురించీ, తమరి రాజ్యాల గురించీ, తమరి పరిపాలన గురించీ క్లుప్తంగా చెప్పవలసిందిగా మనవి.



ఆ విధంగా మీరు చేస్తున్న మంచి పనుల గురించి మిగిలిన పాలకులందరికీ తెలుస్తుందనీ, వాటి అమలు వల్ల ఇతర రాజ్యాల ప్రజలకు కూడా మేలు కలుగుతుందని చక్రవర్తుల వారి భావన!" అన్నాడు.

అప్పుడు కోసలదేశపు మహారాజు లేచి నిలబడి గంభీరంగా "మహారాజా! నేను పది రాజ్యాలను గెలిచాను. నా ఖజానా నిండా

ఎనలేని బంగారం, వజ్రాలు, వైడూర్యాలు, నగలు ఉన్నాయి. నావద్ద ఉన్నంత సంపద మన దక్షిణాపథంలో ఎవ్వరి వద్దా లేదు. యావద్దక్షిణాపథంలో నన్ను మించిన వారు లేరు" అని చెప్పి కుర్చున్నాడు.




వెంటనే కళింగ మహారాజు లేచి గట్టిగా నవ్వి, "నీ సొత్తుకు మూడింతల సొమ్ము ఉంది, నా దగ్గర. పైపెచ్చు పద్నాలుగు మండలాలు పూర్తిగా నా ఆధీనంలో ఉన్నాయి. ఇరవై వేల మంది సైనికుల బలం మాది. కేవలం ప్రభుత్వ వినియోగం కోసమనే మూడు వేల ఎకరాల భూమి ఉంది మాకు!" అని చెప్పి కూర్చున్నాడు.

ఆ వెంటనే పకపకా నవ్వుకుంటూ విజయనగర మహారాజు లేచాడు. "మాకు ఐదు వేల ఎకరాల భూమి ఉంది.

మీకు లేనంత ధనము, సైనిక బలము ఉన్నాయి. మీరు మాకన్నా దేనిలోనూ ఎక్కువ కాదు! నేను ఎందరు రాజులను ఓడించి చెరసాలలో బంధించానో లెక్కలేదు: అని కూర్చున్నాడు. ఈ విధంగా రాజులందరూ ఒక్కొక్కరూ తమ గొప్పతనాన్ని తమ ముందు రాజులు చెప్పిన సంపద లెక్కలతో పోల్చి చెప్పుకుంటూ పోయారు. చివరికి, అంగ మహారాజు లేచాడు.

ముందుగా సభలోని వారికి అందరికీ కృతజ్ఞతలు చెప్పి, ఆనక విజయసింహ మహారాజుతో చెప్పాడు: "మహారాజా! తమరి సామ్రాజ్యపు సరిహద్దున ఉన్న చిన్న దేశం మాది. ఈ రాజులందరూ చెప్పినన్ని మొత్తాలు మా ఖజానాలో ఏనాడూ లేవు. అయినప్పటికీ మేము మా రాజ్యంలో ఎన్నో చెరువులు, బావులు త్రవ్వుకున్నాం. చక్కని

రోడ్లు వేసుకున్నాం. రాజ్యంలోని ప్రజలందరికీ కనీస ఆహార,గృహ వసతులను, పిల్లలు చదువుకునేందుకు చక్కని పాఠశాలలను ఏర్పరచుకున్నాం.



మా సైనికులకు, వారి కుటుంబాలకు వసతులు ఏర్పరచుకున్నాం.

ఇవన్నీ మా ప్రజల మంచితనం వల్ల, క్రమశిక్షణ వల్ల వీలైనాయి. ఇక ఇంతకంటే గొప్ప పనులు ఐతే మేము ఏమీ చేయలేదు: అని ముగించి కూర్చున్నాడు.

సభ అంతా కొద్ది సేపు నిశ్శబ్దమైపోయింది. తర్వాత రాజులు, మహరాజులతో అందరూ లేచి నిలబడి చప్పట్లు కొట్టారు. సభంతా హర్షధ్వానాలతో నిండిపోయింది.


విజయసింహుడు అంగరాజును అభినం-దిస్తూ " 'రాజు తన ఖజానా గురించి కాక, ప్రజల బాగు గురించి తపించాలి' అని మాకందరికీ నేర్పించిన అంగ ప్రభువులవారు మాకు గురు తుల్యులు. వారికి మనసారా నమస్కరిస్తూ, రాబోయే పది సంవత్సరాల వరకు అంగరాజ్యం వారు మాకు కట్టవలసిన కప్పాన్ని పూర్తిగా మినహాయిస్తున్నాం" అని ప్రకటించాడు!

తెలివైన పాప!

శ్రుతి: ఈ రోజు లెక్కల పరీక్షలో మంజు ఒకే ఒక మార్కు తెచ్చుకుంది. దాన్ని ఐదుగా దిద్దిందని టీచర్ కనిపెట్టేసింది!

తాతయ్య: నువ్వు అలాంటి పని ఎప్పుడూ చెయ్యవు-. కదూ?!

శ్రుతి: అవును. నిజమే తాతయ్యా. నేనైతే ఒకటిని ఏడుగా దిద్ది ఉండేదాన్ని.



సోమరి గుర్రం

సేకరణ: కుంచె లక్ష్మీనారాయణ, అనంతపురం.

"చరణ్! గంట నుండీ కార్టూన్స్ చూస్తున్నావు. ఇంతకీ హోం వర్క్ చేశావా, లేదా?!" అరిచింది అమ్మ.

చరణ్ నాలుక కొరుక్కున్నాడు. "లేదమ్మా! మర్చి పోయాను" అన్నాడు. ఆ తర్వాత మెల్లగా "ఇవాళ్ల హోంవర్కు చెయ్యనులేమ్మా, చెయ్యి నొప్పిస్తూ ఉంది" అన్నాడు బద్ధకంగా.

"ఒరేయ్! త్వరగా హోంవర్కు పూర్తి చేస్తే నీకో మంచి కథ చెప్తా" అంది జ్యోతి.

చరణ్‌కి కథలంటే చాలా ఇష్టం. తల్లి 'కథ' అనగానే వాడి చెయ్యి కదిలింది. చకచకా హోంవర్కు పూర్తిచేసాడు. ఆ వెంటనే కథ చెప్పడం మొదలు పెట్టింది జ్యోతి:

గోదావరి సముద్రంలో కలిసే చోట అమరాపురం అనే ఊరు ఒకటి ఉండేది. ఆ ఊళ్లో ఉండే సోము ఉప్పు వ్యాపారం చేసేవాడు. అతనికి ఒక గుర్రం ఉండేది. రోజూ ఉప్పు మూటలు కట్టి నది ఆవలి ఒడ్డుకు తీసుకెళ్ళి అమ్మేందుకు ఈ గుర్రాన్ని

వినియోగించేవాడు సోము.

ఒకసారి రోజూలాగే ఉప్పు మూటల్ని గుర్రానికి కడుతూ, "ఇదిగో, వీటిని తీసుకెళ్ళి నది అవతలి వైపున వేసి, వెనక్కి తిరిగి రా. ఆలోగా నేను మరో రెండు మూటలు నది ఒడ్డుకు చేరుస్తాను. ఒకసారి నువ్వు వెనక్కి వచ్చాక, ఈ రెండు మూటల్ని కూడా అవతలి ఒడ్డుకు తీసుకుపోయి, మొత్తం ఉప్పునూ అమ్ముకు వద్దాం!" అని చెప్పాడు సోము.

గుర్రం "సరే" అని తల ఊపి రెండు ఉప్పు మూటలు తీసుకొని, నది ఒడ్డుకు చేరుకొని, నది దాటబోయింది. నదిలో నీళ్ళు నిండుగా ప్రవహిస్తున్నాయి. అట్లా నది దాటుతున్న గుర్రానికి అకస్మాత్తుగా నది మధ్యలో కాలు జారింది- మూటలు రెండూ నదిలో పడ్డాయి.

“అరే! ఎంత పనైంది!” అనుకున్న గుర్రం నానా తంటాలు పడి మూటల్ని మళ్ళా తన వీపుకెత్తుకున్నది. ఐతే ఇప్పుడు బస్తాలు తేలిక బారాయి! నదీ ప్రవాహం కారణంగా మూటల్లోని ఉప్పు కరిగిపోయిందన్న మాట!

దాంతో గుర్రానికి చాలా సంతోషం వేసింది: "రోజూ ఇట్లాగే చేస్తే బలే ఉంటుంది కదా, ఎక్కువ బరువు మోసే ఖర్మ ఉండదు!” అనుకున్నది తనలో తాను.


అయితే ఆ రోజున సోము అమ్మిన ఉప్పుకు ఎప్పుడూ వచ్చేదానికంటే తక్కువ డబ్బు వచ్చింది. "మూటలు తేలిక ఎందుకు ఐనాయబ్బా, పొరపాటుగా నేనే ఏమైనా తక్కువ మూటలు కట్టానేమో" అనుకున్నాడతను.

రెండో రోజున సోము మరింత జాగ్రత్తగా మూటలు కట్టాడు. “ఇవాళ్ళ తూకం బాగా వస్తుందిలే!” అనుకున్నాడు. ముందు రెండు మూటలు గుర్రానికి కట్టి పంపాడు.

సుఖం మరిగిన గుర్రం నదిలో మునిగి, కొంత ఉప్పు కరిగిపోయాక, ఆ బస్తాలను అవతలివైపున పడేసి తిరిగి వచ్చింది.

ఆ రోజు కూడా ఉప్పు మూటలు తక్కువ బరువే తూగాయి. "ఎందుకు, రోజూ ఇట్లా

నష్టం వస్తున్నది?" అని అనుమానించిన సోము మరుసటి రోజున గుర్రం మీద రెండు మూటలు వేసి, దాని వెనకనే తనూ బయలుదేరి పోయాడు.



యజమాని వెనకే ఉండటం చూసుకోని గుర్రం ఆ రోజున కూడా నదిలో మునిగింది. కొంత ఉప్పు కరిగాక, పైకి లేచి అవతలి ఒడ్డుకు చేరుకున్నది.

"ఒహో! ఇదంతా దీని పనేనా? ఇంత మోసం చేస్తున్నదే?! బుద్ధి చెప్పాలి!" అనుకున్న సోము, మరుసటి రోజున ఉప్పుకు బదులుగా పెద్ద పెద్ద దూది మూటలు వేశాడు దాని మీద.

నది దాటబోయిన గుర్రం రోజూలాగే నది మధ్యకు రాగానే నీళ్ళలోకి మునిగింది. అయితే కొట్టుకు పోయేందుకు ఇప్పుడది ఉప్పు కాదుగా? తేలికైన దూది అంతా నీళ్ళు పీల్చుకొని బరువెక్కిపోయింది!

అంత బరువును లాగలేని గుర్రం అటు మునగలేక, ఇటు ఒడ్డుకు రాలేక, నానా తంటాలూ పడింది!

దాని వెనకే వచ్చిన సోము "హ..హ..హ...!" అని నవ్వి, "చూడు గుఱ్ఱమా! నేను నా పనిని ప్రేమిస్తాను, ఎంచక్కా కష్టపడి పని చేస్తాను. నీలాగా సోమరిని కాదు నేను. నిజానికి నువ్వు కూడా ఇట్లా సోమరిగా ఉండకూడదనే, నేను నీకు బుద్ధి చెప్పింది!" అన్నాడు. అటుపైన గుర్రం తను చేసే పనిని ప్రేమించటం నేర్చుకున్నది.

అమ్మ ఈ కథ చెప్పి, "చూసావా చరణ్! సోమరితనం వల్ల ఎవ్వరూ ప్రయోజకులు కారు. అందుకని ఏనాడూ నీ పనిని నువ్వు వాయిదా వేయకు. చేయవలసిన పనిని చేస్తూ పోతుంటే విజయం నిన్నే వరిస్తుంది" అని అమ్మ సుద్దులు నేర్పింది.

బొమ్మకు కథ రాయండి

భయం! ఈ భయం చాలా వింతగా ఉంటుంది. ఇదిగో, వీడికి ఇప్పుడు భయం వేసిందనమాట. భయం వేస్తే ఏం చేయాలి? వీడు పారిపోతున్నాడు. ఎక్కడికి? ఏమో, ఇంటికేనేమో మరి. లేకపోతే మరి పోలీసు స్టేషనుకైనా కావొచ్చు. ఎందుకు వేసింది భయం? ఏమో, అదీ తెలీదు మాకు. మీకు తెలుసేమో చూడండి. వీడి కథ మాకు రాసి పంపండి. ఎంపికైన కథల్ని కొత్తపల్లిలో ప్రచురిస్తాం! మొదలు పెట్టండి మరి !



మా చిరునామా, తెలుసుగా?-

కొత్తపల్లి ప్రచురణలు, 1-127/A, MRO ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి , అనంతపురము జిల్లా, ఆంధ్రప్రదేశ్-515101.

పదాల్ని వెతికి పట్టుకోండి!

పడవ, బంగారము, తరగతి, చలాకీ, కుక్క పిల్ల, వినాయకుడు, దయ్యాలు, వయసు, పరీక్షలు, రూపాయలు, రాఘవయ్య, కుళాయి, అంగడి, ఊపిరి, సంతోషం, సానుభూతి, పదిహేడు, రెండువేలు, రెండోవాడు, అవసరం :- *ఈ పదాలన్నీ క్రింది పట్టికలో దాగున్నాయి-నిలువుగా, అడ్డంగా, వాలుగా, క్రింది నుండి పైకి -ఎటుపడితే అటు! వాటిని వెతికి వాటి చుట్టూ గుండ్రాలు గీయండి!*

బం	య్య	త	ర	గ	తి	భూ	ను	సా	తో	చ	య్య
డో	ల్ల	రం	క్ష	సు	హే	య్య	తి	హే	ళా	లా	భూ
క్ష	రెం	స	య	లు	లు	వే	డు	రెం	య్య	కీ	రెం
ఘ	రం	వ	ల్ల	య	క్ష	బం	క్క	షం	డో	డు	బం
డి	భూ	అ	పి	పా	రీ	డో	ఊ	ల్ల	హే	వా	హే
గ	తి	క్ష	క్క	రూ	ప	య్య	ససం	రి	తో	రం	డు
అం	డో	క్క	కు	ప	డ	వ	రెం	ఘ	పి	కు	డు
కీ	ళా	షం	ది	భూ	ళా	య్య	షం	హే	య	ఊ	నా
క్క	ది	హే	లు	ల్ల	వ	క్ష	ము	నా	య	య్య	రం
రెం	డు	వే	క్ష	ఘ	బం	ర	వి	య	డు	తి	సు
లు	ఊ	క్ష	రా	తి	గా	ఊ	యి	ళా	కు	భూ	రం
బం	లు	య్య	ద	బం	క్క	షం	రెం	య	షం	తో	సం


RNI Regn No. : APTEL/2014/62705 Date Of Publishing: 10/09/2017 Postal Regn No: HDP/008/2015-2017

మంచి పుస్తకం:


కానుక

60 చిట్టి పేజీలు, వెల రూ.50 ప్రతులకు: శ్రీ వి. ఆర్. శర్మ, సనత్ నగర్, హైదరాబాదు. ఫోన్: 9177887749

ఐదుగురు పిల్లలు ప్రపంచాన్ని ఎలా రక్షించారు? అది తెలియాలంటే మొదట అసలు ఈ ప్రపంచానికి ఏం ఆపద వొచ్చిందో తెలియాలి. పవర్‌లాండ్ అనే గ్రహవాసులు భూమిని ఆక్రమించుకున్నారు. భూమి మీద ఉన్న అన్ని ప్రాణుల్నీ వాళ్ళు అణువులుగా మార్చి వాతావరణంలో కలిపేసారు. ఇక మిగిలింది ఈ ఐదుగురు పిల్లలే! 'మదర్‌లాండ్' నుండి వచ్చిన అంగార, నక్షత్రల సాయంతో వీళ్ళు మనందరినీ కాపాడారు.



అదంతా ఎట్లా జరిగిందో వివరంగా తెలుసుకోవాలంటే డా.వి.ఆర్ శర్మ గారు వ్రాసిన ఆధునిక అద్భుత కాల్పనిక సాహస బాలల నవల 'కానుక' చదవాల్సిందే. ప్రపంచానికి ఆధునిక సాంకేతికతతో విపరీతమైన ఆపదలు ముంచుకు రావటం, సూపర్‌మ్యాన్‌లు వాళ్ళని ఎదుర్కొని ప్రపంచాన్ని కాపాడటం ఆంగ్ల సాహిత్యంలో విరివిగా ఉన్నది. ఎటొచ్చీ తెలుగు పుస్తకాలే, అలాంటి కథలలో కొంచెం వెనుకబడ్డాయి. ఈ ఖాళీని నింపే ప్రయత్నం చేస్తుంది- 'కానుక'.



పైకి వచ్చిపడే ప్రమాదపు కెరటాల నుండి తమని తాము రక్షించుకుంటూ ఇతరుల్ని కూడా కాపాడాలంటే చాలా ధైర్యం, స్థైర్యం అవసరం. అట్లా సాహసాలకు వెనుదీయని పిల్లల్ని తయారు చేసే దృష్టితో రాయబడిన యీ చిట్టి నవల చదువరులలో ఉత్తేజాన్ని ఉద్వేగాన్ని నింపుతుంది.

ఔత్సాహికులు వి.ఆర్ శర్మ గారి కలం నుండి వెలువడిన యీ మొదటి పిల్లల నవలలో ఇరవై ఒకటో శతాబ్దపు వేగం, పాత్రా చిత్రణ, శైలి, ప్రాపంచిక దృక్పథం ఉన్నాయి. వీటిని ఇష్టపడే e- తరం పిల్లలకు యీ పుస్తకం నచ్చుతుంది!

“Kottapalli” Printed and Published by Narayana Sarma on behalf of Kottapalli Prachuranalu and printed at Mudrica Offset Printers, Vijayawada and published at 1-127/A, Near MRO Office, Chennekothapalli, Ananthapuram District, AP-515101. Editor: Narayana Sarma.